రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్
వార్త





# మూగజీవాలపై మమకారం



అటవీప్రాంతంలో ఏర్పాటు చేసిన నీటి తొట్టెలు (ఇన్‌సెట్) సర్పంచ్ ధనలక్ష్మి

★అడవి బాట పట్టిన సర్పంచ్ ★వన్యనప్రాణుల దాహం తీర్చటానికి నీటి తొట్టెలు ఏర్పాటు ★పర్యావరణ ప్రేమికుల ప్రశంసలు

**వేసవి భానుడు నిప్పులు చెరుగుతున్నాడు. మండుతున్న ఎండల తీవ్రతకు మనుషులే దాహంతో అల్లాడిపోతుంటే, నోరులేని మూగ జీవాల పరిస్థితి వర్ణనాతీతంగా మారింది. అడవిలో నీటి వనరులు ఎండి పోవడంతో, చుక్క నీటి కోసం వన్యప్రాణులు అల్లాడుతున్న పరిస్థితిని గమనించి కేశంపేట మండల పరిధిలోని కోనాయిపల్లి గ్రామ సర్పంచ్ చొప్పరి ధనలక్ష్మి రామకృష్ణ ముదిరాజ్ మానవత్వాన్ని చాటుకున్నారు.**

**కేశంపేట, మే 11 ప్రభాతవార్త:** అడవిలో నీరు లేక వన్యప్రాణులు జనావాసాల్లోకి రాకుండా చూడాలనే సంకల్పంతో, సోమవారం సర్పంచ్ ధనలక్ష్మి స్వయంగా గ్రామ శివారులోని అటవీ ప్రాంతంలో నీటి తొట్లను ఏర్పాటు చేశారు.

**ప్రకృతిలో ప్రతి ప్రాణికీ జీవించే హక్కు ఉంది**

నీరు లేక వన్యప్రాణులు పడుతున్న ఇబ్బందులను చూసి తన మనసు చలించిందని, ప్రకృతిలో మనుషులతో పాటు ప్రతి ప్రాణికీ జీవించే హక్కు ఉందని ఆమె ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఒక సర్పంచ్‌గా తన బాధ్యత కేవలం గ్రామానికే పరిమితం కాదని, పర్యావరణాన్ని కాపాడుకోవడం కూడా మన అందరి బాధ్యత అని ఆమె పిలుపునిచ్చారు. వన్యప్రాణుల పట్ల సర్పంచ్ చూపుతున్న ఈ చొరవపై అటు గ్రామస్తులు, ఇటు పర్యావరణ ప్రేమికులు హర్షం వ్యక్తం చేస్తూ ప్రశంసలు కురిపిస్తున్నారు. ఈ కార్యక్రమంలో గుండెమోని రాములు ముదిరాజ్, రంగు శ్రీకాంత్, ఢిల్లీ చంద్రశేఖర్, కాకర్ల సునీల్, మహేష్, రంగు రాకేష్, సోమరాజు, చాగంటి శ్రవణ్ కుమార్, బాలరాజ్ తదితరులు పాల్గొని సర్పంచ్ వెంట ఉండి నీటి తొట్లను ఏర్పాటు చేశారు.

# బేటీ బచావో పూర్తిగా అబద్ధం



## బండి సంజయ్ రాజీనామా చేయాలి

## డిసిసి చీఫ్ వజ్రేశ్‌యాదవ్ డిమాండ్

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, మే 11, ప్రభాతవార్త :** ఆడపిల్లల రక్షణ అనేది బిజెపి నాయకుల మాటలకే పరిమితమైందని, బిజెపి పాలనలో బేటి బచావో నినాదం పూర్తిగ అబద్ధమని డిసిసి అధ్యక్షులు తోటకూర వజ్రేశ్‌యాదవ్ మండిపడ్డారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ సంజయ్ కుమారుడు బండి సాయిభగీరథ్‌పై ఓ మైనర్ అమ్మాయి తనను లైంగికంగా వేధించినట్లు పోలీసులకు ఫిర్యాదు రావటంతో ఫోక్సో కేసు నమోదు అయిందని తెలిపారు. ఈ కేసును నిష్పక్షపాతంగా దర్యాప్తు జరగాలంటే కేంద్ర మంత్రిగా ఉన్న బండి సంజయ్ వెంటనే తన మంత్రి పదవికి, ఎంపి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే తన పలుకుబడిని ఉపయోగించి కేసును నీరు గార్చే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.

# ఓటరు మ్యాపింగ్‌లో మేడ్చల్ స్పీడ్

ట్యాగ్ చేయడం జరిగిందని వివరించారు. పనులను మరింత వేగవంతం చేసేందుకు జిల్లాలోని ఐదు నియోజకవర్గాల్లో అవసరానికి అనుగుణంగా అదనపు డేటా ఆపరేటర్లను నియమించి పనులను కేటాయించినట్లు కలెక్టర్ మను చౌదరి వివరించారు.

- గడువులోగా 90 శాతం లక్ష్యం!
- గతంతో పోలిస్తే 5.2 శాతం పురోగతి
- వేగవంతం చేయడానికి ప్రత్యేక వ్యూహాలు
- క్షేత్రస్థాయిలో అదనపు డేటా ఆపరేటర్ల నియామకం
- ఎన్నికల ప్రధాన అధికారి వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ మను చౌదరి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న మేడ్చల్ కలెక్టర్ మనుచౌదరి, అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, జిల్లా అధికారులు

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, మే 11 ప్రభాతవార్త :** మేడ్చల్ జిల్లాలో ఓటరు జాబితా మ్యాపింగ్ ప్రక్రి యను అత్యంత ప్రాధాన్యతతో, నిర్ణీత గడువు లోగా పూర్తి చేసేందుకు జిల్లా యంత్రాంగం అన్ని చర్యలు చేపట్టింది. సోమవారం మేడ్చల్ జిల్లా కలెక్టరేట్ నుండి రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్‌రెడ్డి వివిధ జిల్లాల కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్ మను చౌదరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా లో మ్యాపింగ్ ప్రక్రియ తీరుతెన్నులను ఆయన వివరించారు. గత సమీక్షా సమావేశంతో పోలిస్తే జిల్లా స్థాయిలో ప్రస్తుతం 5.2 శాతం అదనపు పురోగతి సాధించినట్లు కలెక్టర్ వెల్లడించారు.

**2025 ఓటరు జాబితాకు అనుగుణంగా సవరణలు**

ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా, 2002 నుంచి ఉన్న పాత ఓటరు జాబితాను ప్రస్తుత 2025 ఓటరు జాబితాకు అనుగుణంగా మార్చే మ్యాపింగ్ ప్రక్రియ కొనసాగుతోంది. ఈ ప్రక్రియను నిర్దేశిత గడువులోగా 90 శాతం పూర్తి చేయాలని ఎఆర్‌లను , ఈఆర్‌ఓలను రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ఆదేశించారు. ఈ లక్ష్యాన్ని చేరుకోవడంలో జిల్లా యంత్రాంగం ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళ్తోంది.

**వెనుకబడిన సిబ్బందిపై దృష్టి**

మ్యాపింగ్ ప్రక్రియలో 10 నుంచి 15 శాతం కంటే తక్కువ పురోగతి చూపిన వారిని వ్యక్తిగతంగా సమీక్షా సమావేశాలకు పిలిచి, వారికి అవసరమైన మార్గనిర్దేశం చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. క్షేత్రస్థాయిలో బీఎల్‌ఓల పని విధానాన్ని నిరంతరం పర్యవేక్షి స్తున్నామని కలెక్టర్ స్పష్టం చేశారు.

**రాజకీయ పార్టీల భాగస్వామ్యం**

ఇప్పటికే రాజకీయ పార్టీల ప్రతినిధులను ఈ ప్రక్రియలో భాగస్వాములను చేస్తూ వారిని

**కాలనీల్లో అవగాహన**

రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ల పరిధిలో జోనల్ కమిషనర్లు తమ సిబ్బందిని పంపి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ, మ్యాపింగ్ ప్రక్రియను వేగవంతం చేస్తున్నారని చెప్పారు. నిర్ణీత గడువులోగా జిల్లాలో మ్యాపింగ్ ప్రక్రియలో మంచి పురోగతి సాధిస్తామని కలెక్టర్ ధీమా వ్యక్తం చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డితో పాటు వివిధ విభాగాల జిల్లా, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

## రెండు రోజుల వ్యవధిలో..

# మళ్లీ సోదాలు

### శంషాబాద్ తహసీల్దార్ కార్యాలయంపై ఎసిబి నజర్

### ఆర్డీవో సమక్షంలో గంటల తరబడి రికార్డుల తనిఖీ

### అక్రమార్కులను వదిలేది లేదని స్పష్టీకరణ

**రంగారెడ్డి అర్బన్, మే11, ప్రభాతవార్త :** రంగారెడ్డి జిల్లా శంషాబాద్ తహశీల్దార్ కార్యాలయం మరోసారి ఏసీబీ అధికారుల తనిఖీలు కొనసాగాయి. కేవలం 2 రోజుల వ్యవధిలోనే అధికారులు రెండోసారి శంషాబాద్ తహసిల్దార్ కార్యాలయంలో ఏసీబీ అధికారులు సోదాలు చేయడం తీవ్ర కలకలం రేపింది. అవినీతి ఆరోపణలు, భూ బదలాయింపులపై ఆరోపణలపై పలువురు బాధితుల నుంచి అందిన ఫిర్యాదుల ఆధారంగా రంగారెడ్డి జిల్లా ఏసీబీ డీఎస్పీ ఆనంద్ కుమార్ నేతృత్వంలో ఈ పైల తనిఖీలు జరగుతున్నాయి. సోమవారం ఉదయం కార్యాలయానికి చేరుకున్న ఏసీబీ అధికారులు, సిబ్బందిని బయటకు వెళ్లనివ్వకుండా రాజేంద్రనగర్ ఆర్డిఓ వెంకటరెడ్డి సమక్షంలో గంటల తరబడి రికార్డుల సోదాలు, అధికారుల విచారణ కొనసాగించారు.

**ఫిర్యాదుల ఆధారంగానే తనిఖీలు**

మొదటిరోజు శుక్రవారం జరిగిన తనిఖీల్లో కొన్ని కీలక పత్రాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అయితే, మరిన్ని వివరాలు సేకరించాల్సి ఉండటం, అలాగే రెవెన్యూ విభాగంలో జరుగుతున్న అవినీతిపై స్పష్టమైన ఆధారాలు లభించడంతో డీఎస్పీ ఆనంద్ కుమార్ ఆధ్వర్యంలో మళ్లీ సోమవారం రెండవ రోజు తనిఖీలకు దిగారు. భూమి రికార్డుల మార్పిడి, రిజిస్ట్రేషన్ అంశాల్లో కొందరు అధికారులు భారీగా ముడుపులు డిమాండ్ చేస్తున్నట్లుగా ఫిర్యాదులు అందాయి. కార్యాలయంలోని వివిధ విభాగాల ఫైళ్లను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించారు. పెండింగ్లో ఉన్న దరఖాస్తులు, వీఆర్వోలు, ఉన్నతాధికారుల వద్ద ఉన్న రికార్డులను ట్యాలీ చేశారు. అయితే మళ్లి మూడవ రోజు మంగళవారం కూడా తనిఖీలు చేపట్టే అవకాశం ఉన్నట్లు సమాచారం..అవినీతికి పాల్పడే ఏ ఒక్కరినీ వదిలే ప్రసక్తే లేదని, సమగ్ర విచారణ తర్వాత నివేదిక సమర్పిస్తామని అధికారులు వెల్లడించారు.

# ఆశతో వస్తున్నారు..

# నమ్మకాన్ని వమ్ము చేయకండి!

◆ప్రజావాణి అర్జీలను తక్షణమే పరిష్కరించాలి
◆జాప్యం చేస్తే సహించేది లేదు
◆అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, విజయేందర్ రెడ్డి

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, మే 11 ప్రభాతవార్త:** ప్రజావాణిలో ప్రజల నుంచి అందిన దరఖాస్తులను సంబంధిత అధికారులు వెంటనే పరిశీలించి, ఎలాంటి జాప్యం లేకుండా పరిష్కరించాలని మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, విజయేందర్ రెడ్డి ఆదేశించారు. సోమవారం మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. జిల్లావ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన ప్రజలు తమ సమస్యలపై మొత్తం 134 దరఖాస్తులను అధికారులకు అందజేశారు. ప్రజావాణికి అందిన దరఖాస్తుల్లో అత్యధికంగా గృహ నిర్మాణ రంగానికి చెందినవే ఉన్నాయి. ఇందిరమ్మ ఇళ్లు, డబుల్ బెడ్రూమ్ ఇళ్ల కోసం 35 మంది దరఖాస్తు చేసుకున్నారు. పింఛన్ల కోసం 22 దరఖాస్తులు అందాయి. రెవెన్యూ విభాగానికి సంబంధించి భూ సమస్యలపై 12 దరఖాస్తులు రాగా, కుత్బుల్లాపూర్ తహసీల్దార్ పరిధిలోని భూములకు సంబంధించి 10 మంది దరఖాస్తులు అందజేశారు. మిగతా వివిధ శాఖలకు సంబంధించి ఇతర దరఖాస్తులు అందినట్లు అధికారులు వెల్లడించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్లు మాట్లాడుతూ, అధికారులు తమ సమస్యలను పరిష్కరిస్తారనే నమ్మకంతోనే ప్రజలు సుదూర ప్రాంతాల నుండి కలెక్టరేట్‌కు వస్తున్నారని, వారి నమ్మకాన్ని వమ్ము చేయకూడదని పేర్కొన్నారు. అర్జీలను ఎట్టి పరిస్థితుల్లోనూ పెండింగ్‌లో పెట్టకూడదని, వెంటనే చర్యలు చేపట్టాలని సూచించారు. ఒకవేళ ఏదైనా దరఖాస్తును తిరస్కరించాల్సి వస్తే, అందుకు గల కారణాలను స్పష్టంగా అర్జీదారులకు వివరించాలని ఆదేశించారు. స్వీకరించిన దరఖాస్తులను మరియు వాటిపై తీసుకున్న చర్యలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా డిఆర్, లా ఆఫీసర్ చంద్రావతి, హౌజింగ్ పిడి రమణమూర్తి, వివిధ శాఖల జిల్లా అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.



మేడ్చల్ ప్రజావాణిలో దరఖాస్తులను స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, విజయేందర్‌రెడ్డి



ప్రజావాణిలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ

## దరఖాస్తుల పరిశీలనకు

# క్షేత్రస్థాయికి వెళ్లండి

### కలెక్టర్ దీపక్ తివారి

**వికారాబాద్ జిల్లా ప్రతినిధి, ప్రభాతవార్త :** ప్రజా వాణి కార్యక్రమంలో వచ్చిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ హాలులో జడ్పీ సీఈఓ సుదీర్‌లతో కలిసి అర్జీదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. 150 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. జిల్లా అధికారులు వచ్చిన దరఖాస్తులను క్షేత్ర స్తాయి లో పరిశీలించి వెంటనే పరిష్కరించాలని అధికా రులను ఆదేశించారు. ప్రజావాణి కార్యక్ర మాన్ని డివిజన్ పరిదిలో నిర్వహిస్తున్నామని, డివిజన్ పరిదిలో వచ్చే దరఖాస్తు లను సంబంధిత డివిజన్ అధికా రులే పరిష్కారం చేయాలనీ తెలి పారు. ప్రజా వాణి కార్యక్రమంలో అందిన ప్రతి దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి క్షేత్రస్థా యిలో 30 రోజుల్లో పరిష్కరించే విధంగా అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకో వాలని, లేని పక్షంలో క్రమశిక్షణ చర్యలు తీసుకోవలసి ఉంటుందని అధికారులను హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో డీఆర్‌డీప శ్రీనివాస్, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.



ఫిర్యాదు దారులతో మాట్లాడుతున్న ఎస్పీ స్నేహామెహ్రా

# ఫిర్యాదు కోసం ఎప్పుడైనా రావచ్చు

- అవసరం అనుకుంటే నేరుగా నన్ను కలవండి
- బాధితులకు ఎస్పీ భరోసా
- ప్రజావాణిలో సమస్యలు ఓపికగా విన్న స్నేహా మెహ్రా

**వికారాబాద్, ప్రభాతవార్త :** ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించి, బాధితులకు తక్షణ భరోసా కల్పించడమే లక్ష్యంగా జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఎస్పీ స్నేహా మెహ్రా అన్నారు. సోమవారం నిర్వహించిన ప్రజా వాణిలో ఆమె స్వయంగా ఫిర్యాదుదారులను కలిసి, వారి సమస్యలను ఓపికగా అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, బాధితులు ఫిర్యాదుల కోసం ఎప్పుడైనా ఎస్పీ కార్యాలయాన్ని సంప్రదించవచ్చని, ఆపదలో ఉన్న వారికి పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుం దని ఆమె హామీ ఇచ్చారు. ప్రజావాణిలో వివిధ ప్రాంతాల నుండి వచ్చిన బాధితుల నుండి అందిన ఫిర్యాదులను సంబంధిత స్టేషన్ హౌస్ ఆఫీసర్లకు పంపనున్నట్లు తెలిపారు.

**మహిళల పట్ల మానవత్వం చూపాలని సిబ్బందికి ఆదేశం**

చట్ట పరిధిలో ఉన్న సమస్యలను ఏమాత్రం జాప్యం చేయకుండా, పూర్తి పారదర్శకతతో విచారణ జరిపి బాధితులకు న్యాయం చేయాలని స్టేషన్ హౌజ్ అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా మహిళలు, వృద్ధులు, బలహీన వర్గాల ఫిర్యాదుల పట్ల అత్యంత మానవత్వంతో వ్యవహరించాలని సూచించారు. ప్రజావాణికి వచ్చే ప్రతి అర్జీని కంప్యూటరైజ్ చేస్తున్నామని, తద్వారా ఫిర్యాదు పరిష్కారమయ్యే వరకు ఉన్నతాధికారులు నిరంతరం పర్యవేక్షి ంచేలా ఒక ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. బాధితులు అవసరం అనుకుంటే నేరుగా తనను కలవవచ్చని ఎస్పీ తెలిపారు.

# నిద్ర మత్తులో కారు డ్రైవింగ్

### ఓఆర్‌ఆర్‌పై వాహనాన్ని ఢీ

### తీవ్ర గాయాలై చికిత్స పొందుతూ మృతి

## భూముల కబ్జాలను ప్రోత్సహిస్తున్న

# అధికారులను బదిలీ చేయాలి

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, మే 11, ప్రభాతవార్త :** మేడ్చల్ జిల్లా పరిధిలోని కుత్బుల్లాపూర్ మండలంలోని గాజులరామారంలోని, జగద్గిరి గుట్టలో గల ప్రభుత్వ భూముల్లో కబ్జాలు మళ్లీ జరుగుతున్నాయని ఆరోపిస్తూ సిపిఐ నేతలు రోడ్డెక్కారు. కొందరు అధికారులు కబ్జాలను ప్రోత్సహిస్తున్నారని వెంటనే వారిపై చర్యలు తీసుకుని ప్రభుత్వ భూములను కాపాడాలని డిమాండ్ చేశారు. ఆ పార్టీ జిల్లా నాయకులు కలెక్టరేట్ వద్ద సోమవారం ఆందోళన నిర్వహించారు. జిల్లా సిపిఐ కార్యదర్శి ఉమామహేశ్‌తో పాటు పలువురు నాయకులు తరలి వచ్చి ప్రజావాణిలో అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు.

ఈ సందర్భంగ జిల్లా సిపిఐ కార్యదర్శి ఉమామహేశ్ మాట్లాడుతూ గతంలో కబ్జాలు జరిగితే హైడ్రా అధికారులు వచ్చి కబ్జాలను కూల్చివేసి తొలగించారని, మళ్లీ ప్రభుత్వ భూముల్లో కబ్జాలు కొనసాగుతున్నాయన్నారు. గతంలో రెవెన్యూ ఇన్స్‌పెక్టర్‌గా పనిచేసి మళ్లీ మండలానికి డిప్యూటీ తహసీల్దార్‌గా రావటంతో మళ్లీ కబ్జాలు పెరిగినట్లు, కబ్జాలకు సహకరిస్తున్నారి ఈ విషయంపై జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి చర్యలు తీసుకోవాలని జిల్లా సిపిఐ నాయకులు కోరారు. కబ్జాదారులకు సహకరిస్తున్న అధికారులను గుర్తించి వెంటనే వారిని బదిలీ చేయాలని, తగు చర్యలు తీసుకోవాలని వారు కోరారు. దీనిలో జిల్లా సిపిఐ కార్యదర్శి ఉమామహేశ్‌తో పాటు జిల్లా సిపిఐ నాయకులు దామోదర్‌రెడ్డి, శంకర్, రచ్చకిషన్, ధర్మేంధ్ర, సత్యప్రసాద్, మండల కార్యదర్శి నరేంద్రప్రసాద్, అమరావతి బాబు, ప్రజా నాట్య మండలి అధ్యక్షురాలు బాబు, తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ వద్ద ఆందోళన వ్యక్తం చేసిన జిల్లా సిపిఐ కార్యదర్శి ఉమామహేశ్ తదితర పార్టీ నాయకులు



## వినియోగదారులు సకాలంలో విద్యుత్ బిల్లులు చెల్లించాలి : చార్మినార్ ఏఈ మహ్మద్ అబ్దుల్ నసీర్



వివరాలు వెల్లడిస్తున్న చార్మినార్ ఏఈ మహ్మద్ అబ్దుల్ నసీర్

**చార్మినార్,మే 11 ప్రభాతవార్త :** పాతబస్తీలోని విద్యుత్ వినియోగదారులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండమెరుగైన విద్యుత్ సేవలు అందిస్తున్నామని టిజిఎస్‌పిటిసిఎల్ చార్మినార్ సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీరు మహ్మద్అబ్దుల్ నసీర్ తెలిపారు. మదీనా సర్కిల్‌లోని చార్మినార్ విద్యుత్ సెక్షన్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూచార్మినార్ సెక్షన్‌లో 176 విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ఉన్నాయని,వినియోగదారులకు అసౌకర్యం లేకుండ విద్యుత్‌సేవలు అందిస్తున్నామని తెలిపారు.వేసవి కాలంలో విద్యుత్ వినియోగం బాగా పెరిగిందని,21 వేల మంది విద్యుత్ వినియోగదారులు ఉన్నారని ఏఈ మహ్మద్ అబ్దుల్ నసీర్ తెలియజేశారు.ఏప్రిల్ నెలలో సెక్షన్ పరిధిలోనాలుగు కోట్ల రూపాయల విద్యుత్ బిల్లులు వసూళ్లు అయ్యాయని,ఈ నెల నాలుగు కోట్ల 75 లక్షల రూపాయలవిద్యుత్ బిల్లులు వసూళ్ల కావలసి ఉందని ఆయన తెలిపారు.విద్యుత్ వినియోగదారులు సకాలంలో బిల్లులు చెల్లించి సహకరించాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో సబ్ ఇంజనీరు సంతోష్ కుమార్,లైన్ ఇన్ స్పెక్టర్‌బి.కె.మంగారావు,రవితో పాటు పలువురు పాల్గొన్నారు.

## రండి..! త్యాగాల తరాన్ని స్మరిద్దాం!!

**హైదరాబాద్, మే 11, ప్రభాతవార్త :**

వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు, మాజీ శాసనసభ్యుడు, యంసీపీఐ(యూ) వ్యవస్థాపక నేత, అమరజీవి కామ్రేడ్ మద్దికాయల ఓంకార్ శతజయంతి వార్షికోత్సవ ముగింపు సభను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయని ఎంసీపీఐ(యూ) నాయకులు వనం సుధాకర్ తెలిపారు. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ ప్రజల బాగోగులు పెట్టుబడిదారీ వ్యవస్థలో లేవు.. కమ్యూనిజంలోనే ఉన్నాయి. చిన్న చిన్న అవాంతరాలు వచ్చినా కమ్యూనిజం ప్రభావం ఎప్పటికీ కొనసాగుతూనే ఉంటుంది అని కామ్రేడ్ ఓంకార్ చెప్పిన మాటలను ఈ సందర్భంగా స్మరించుకున్నారు.శతజయంతి వార్షికోత్సవ ముగింపు సభ ఈ నెల 12వ తేదీ సాయంత్రం 4 గంటలకు వరంగల్ జిల్లా నర్సంపేటలోని సిటిజెన్ క్లబ్ ఆవరణలో నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రజాస్వామ్య, కార్మిక, రైతు, విద్యార్థి సంఘాల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీ సంఖ్యలో పాల్గొని సభను జయప్రదం చేయాలని సుధాకర్ పిలుపునిచ్చారు.

## కిడ్నాప్ వ్యవహారంలో తుపాకులతో సెటిల్‌మెంట్!

**- పోలీసుల అదుపులో ఆరుగురు ముఠా సభ్యులు**

**- నిందితుల్లో రౌడీషీటర్లు, సూడో పోలీసులు**

**జూబ్లీహిల్స్, మే 11, ప్రభాతవార్త:** బంజారాహిల్స్‌లో ప్రేమ వ్యవహారం లో పోలీసుల పేరుతో కిడ్నాప్‌కు పాల్పడి డబ్బులు దోచుకున్న సంఘటన లో కొత్తకోణం వెలుగుచూసింది. మూడు తుపాకుల సాయంతో ఈ ముఠా బెదిరింపులకు పాల్పడి డబ్బులు కాజేసినట్లు తెలుస్తుంది. విశ్వసనీయ సమాచారం మేరకు.. ఖమ్మంకు చెందిన ఒక యువతి ప్రేమించిన నిఖిల్ అనే యువకుడికి మధ్య మనస్పర్థలు రావడంతో ఇద్దరు ఒకరికొకరం దూర మయ్యారు. ఈ క్రమంలోనే యువకుడిని బెదిరించి కోటి రూపాయలు వసూలు చేయాలని యువతి తనకు తెలిసిన స్నేహితుడి గ్యాంగ్‌కు సూచించింది. దీంతో ఖమ్మంకు చెందిన రౌడీషీటర్ మహేష్, అతని సోదరుడు సాయంతో నగరంలోని అల్వాల్ ప్రాంతానికి చెందిన జాని, మరో ఇద్దరితోపాటు అంబర్‌పేటకు చెందిన రౌడీషీటర్ అన్వర్ తదితరులంతా ఒక ముఠాగా ఏర్పడ్డారు. వీరంతా బంజారాహిల్స్ ఎన్బీటీనగర్‌కు చెందిన చందు అనే వ్యక్తి ద్వారా నిఖిల్ స్నేహితుడైన సాయిని బెదిరించి నిఖిల్ జాడ తెలుసుకున్నారు. నిఖిల్ అనంతపురంలో ఉంటారని తెలుసుకున్న నిందితులు గిద్దలూరుకు చెంది కర్నూలు ప్రాంతంలో ఉండేటువంటి పాతనేరస్థుడు ప్రసాద్‌రెడ్డి సాయం తీసుకున్నారు. తద్వారా అనంపురంలో నిఖిల్‌ను పట్టుకొని బెదిరించి రూ. 50 లక్షలు ఇవ్వాలంటూ బెదించారు. రూ. 20లక్షలు తొలుత ఇస్తానని, మరో రూ. 30 లక్షలకు అప్పు పత్రం రాసి ఇచ్చాడు. ఈ క్రమంలోనే రూ. 13.26 లక్షలను వారికి చెల్లించాడు. ఈ వ్యవహారంలో ప్రసాద్‌రెడ్డి ద్వారా సమకూర్చుకున్న మూడు తుపాకులను నిందితులు ఉపయోగించి ఈ దోపిడికి పాల్పడినట్లు గుర్తించారు. ఇప్పటికే ఆరుగురు నిందితులను బంజారాహిల్స్ పోలీసులు అదుపులోకి తీసుకొన్నారు. వారి నుంచి మూడు తుపాకులను స్వాధీనం చేసుకోగా అందులో ఒక తుపాకి ఇనుపది కాగా మరో రెండు ప్లాస్టిక్ బొమ్మ తుపా కులుగా తేలింది. వీటితోపాటు ఒక గొడ్డలి, సుత్తి సైతం పోలీసులు స్వాధీ నం చేసు కున్నట్లు సమాచారం. కాగా ఈ వ్యవహారంలో ప్రధాన నిందితులతోపాటు ఒక రౌడీషీటర్ ఇంకా పరారీలో ఉన్నట్లు సమాచారం. ఒకటి, రెండు రోజుల్లో నిందితులను మీడియా ముందు ప్రవేశపెట్టే అవకాశం ఉంది.

## పేదలకు అండగా సిఎంఆర్ఎఫ్ : కొలన్ హన్మంత్ రెడ్డి

**నిజాంపేట్, మే 11, ప్రభాతవార్త**

కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలో అనారోగ్యంతో బాధపడుతూ ప్రైవేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న పలువురు పేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఆర్థిక సహాయం అందజేశారు. చికిత్స ఖర్చులకు ఇబ్బందులు ఎదుర్కొంటున్న బాధితులు కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డిని సంప్రదించగా, ఆయన రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సహకారంతో ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా శస్త్ర చికిత్సల నిమిత్తం ఆర్థిక సాయం మంజూరు చేయించారు. సోమవారం బాచుపల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ మంజూరి చెక్కులను అందజేశారు. రోడమేస్త్రీ నగర్‌కు చెందిన రఫియా బేగమ్‌కు రూ.35 వేలు, గాజులరామారం వాసులు పెరుమల్ల రవికి రూ.35 వేలు, మొహమ్మద్ రుక్ ఉద్దిన్‌కు రూ.27,500, దుండిగల్‌కు చెందిన గైక్వార్డ్ రాజుకు రూ.54 వేలు, జగద్గిరిగుట్టకు చెందిన ఫాతీమాకు రూ.60 వేలు, సుభాష్ నగర్‌కు చెందిన ముంతాజ్ బేగమ్‌కు రూ.60 వేలు, గాజులరామారం వాసి నేమూరి శ్రీనివాస్ గౌడ్‌కు రూ.37,500, దూలపల్లికి చెందిన హిమ బిందు సురకాంతికి రూ.42 వేలు, కుత్బుల్లాపూర్‌కు చెందిన కమ్మరి బ్రహ్మయ్యకు రూ.50 వేలు ఆర్థిక సహాయం అందజేశారు.ఈ సందర్భంగా కొలన్ హన్మంత్ రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయనిధి పేద ప్రజలకు ఎంతో ఉపయోగపడుతోందని అన్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న ప్రతి ఒక్కరూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పేద ప్రజల సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతరం పనిచేస్తోందని తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, పాల్గొన్నారు.

## చదువు ఆవశ్యకతను తెలియజేస్తూ ర్యాలీలు

**చాంద్రాయణగుట్ట, మే 11, ప్రభాతవార్త :** ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణలో భాగంగా సోమవారం నుండి ఈనెల 17వ తేదీ ఆదివారం వరకు విద్యా వారోత్సవాలను నిర్వహిస్తున్నారు. నిర్దేశిత కార్యక్రమం మేరకు పలు ప్రభుత్వ పాఠశాలలో తొలి రోజున సమీప బస్తీలలో ర్యాలీ నిర్వహించారు. చదువు ఆవశ్యకతను తెలయజేస్తూ ప్రజల్లో అవగాహన కల్పించా రు. గౌలిపురా లలితాబాగ్ రోడ్డులోని శాలిబండ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు నిర్వహించిన ర్యాలీలో ఆ పాఠశాల స్కూల్ అసిస్టెంట్ ఎస్.విజయ భాస్కర్ మాట్లాడుతూ చదువుతోనే ఉన్నత స్థానాలు సాధ్యమన్నారు. సమాజంలోని అన్ని వర్గాల ప్రజలు అభివృద్ధి చెందాలంటే చదువు ఎంతో ముఖ్యమన్నారు.

# కేంద్ర మంత్రి బండి సంజయ్ భేషరతుగా రాజీనామా చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ సీనియర్ నేత నగేష్ ముదిరాజ్

**ఇందిరాపార్కు, ధర్నాచౌక్‌లో**

**ముషీరాబాద్, మే 11, ప్రభాతవార్త:** కేంద్రమంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్, మైనర్ బాలిక పట్ల ప్రవర్తించిన తీరు దారుణమని, ఈ ఘటనకు బాధ్యత వహిస్తూ భేషరతుగా, బండి సంజయ్ తన పదవికి రాజీనామా చేయాలని బీఆర్ఎస్ సీనియర్ నేత నగేష్ ముదిరాజ్ డిమాండ్ చేశారు. సోమవారం ఇందిరాపార్కు, ధర్నాచౌక్‌లో ఏర్పాటుచేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బండి భగీరత్ పోక్సో చట్టం కింద కేసు నమోదు అయినప్పటికీ, దానిని హని ట్రాప్‌గా కేసును నిర్వీర్యం చేశారని వస్తున్న ఆరోపణలు వస్తున్నప్పటికీ, బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు స్పందించకపోవటం విచారకరమన్నారు. మైనర్ బాలిక పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన భగీరథ్‌ను ఇప్పటి వరకు అరెస్ట్ చేయకుండా పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్త శుద్ధి ఉంటే సమగ్ర విచారణ జరిపి, బాధ్యుడైన బండి భగీరథ్‌ను అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించాలని డిమాండ్ చేశారు.ఈ సమావేశంలో బీఆర్ఎస్ నేతలు సాయిరాం, దినేష్, రమేష్, సాయికిరణ్, కన్నా పాల్గొన్నారు.

**సైబరాబాద్ కమిషనరేట్ ముందు...**

**గచ్చిబౌలి, మే 11 ప్రభాతవార్త :** మైనర్ బాలిక మీద అఘాయిత్యం చేసి, పోక్సో కేసు నమోదైన కేంద్రమంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్ మీద వెంటనే చర్యలు తీసుకోవాలని బిఆర్ఎస్ మహిళా విభాగం డిమాండ్ చేసింది. ఈ మేరకు బిఆర్ఎస్ మహిళా విభాగం నాయకులు సోమవారం సైబరాబాద్ కమిషనర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం గచ్చిబౌలిలోని సైబరాబాద్ కమీషనరేట్ ముందు బిఆర్ఎస్ నాయకురాలు తుల ఉమా మాట్లాడుతూ తమ బిడ్డకు అన్యాయం జరిగిందని బాధితురాలి తల్లిదండ్రులు పోలీస్ స్టేషన్‌లో పిర్యాదు చేసి 48 గంటలు గడుస్తున్నా ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. కేంద్రమంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్‌ను వెంటనే అరెస్టు చేయాలని, బాధితురాలికి తగిన న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. బిఆర్ఎస్ సీనియర్ నాయకులు, గచ్చిబౌలి డివిజన్ మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా మాట్లాడుతూ ..ప్రభుత్వం స్పందించి బండి భగీరథ్‌ను వెంటనే అరెస్టు చేయడంతో పాటు బాధితురాలికి తగిన న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కమీషనర్‌కు వినతిపత్రం సమర్పించిన వారిలో బిఆర్ఎస్ మహిళా విభాగం నాయకురాళ్లు, సీనియర్ నాయకులు ఉన్నారు.

**కార్వాన్ డివిజన్ పార్టీ కార్యాలయంలో**

**కార్వాన్,మే11,ప్రభాతవార్త :** కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కొడుకు బండి సాయిభగీరథ్ పై పోక్సో కేసు నమోదు చెయ్యాలని బీ.ఆర్.ఎస్ పార్టీ కార్వాన్ నియోజక వర్గం ఇంచార్జ్ ఠాకూర్ జీవన్ సింగ్ డిమాండ్ చేశారు.ఈ సందర్భముగా కార్వాన్ డివిజన్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో వారు మాట్లాడుతూ..ఈ ఘటనపై నైతిక బాధ్యత వహిస్తూ బండి సంజయ్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని,లేనిపక్షంలో కేంద్ర మంత్రివర్గం నుండి ఆయన్ను వెంటనే బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేస్తున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో కార్వాన్ నియోజక వర్గం అధ్యక్షురాలు అనిత,సురేఖ,ముత్యాల భాస్కర్,రఘు, దుర్గరాజ్,కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

**బోయిన్‌పల్లిలో**

**కంటోన్మెంట్,మే 11 ప్రభాతవార్త:** మైనర్ బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడిన కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్‌ను వెంటనే అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని,అదే విధంగా బండి సంజయ్‌ని మంత్రి మండలి నుంచి బర్తరఫ్ చేసి బాధిత బాలికకు న్యాయం చేయాలని బేవరేజెస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్,కంటోన్మెంట్ ఉద్యమ నేత గజ్జెల నాగేష్ డిమాండ్ చేశారు. సోమవారం బోయిన్‌పల్లిలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ భగీరథ్‌పై ఫోక్సో చట్టం ప్రకారం కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. అదే విధంగా బాధిత కుటుంబానికి రక్షణ కల్పించాలన్నారు.ఈ కార్యక్రమంలో బోయిన్‌పల్లి మార్కెట్ మాజీ చైర్మన్ టీ.ఎన్.శ్రీనివాస్, బిఆర్ఎస్ నేతలు రావుల సతీష్,రాజు,పనస సంతోష్, మురళీ యాదవ్ పాల్గొన్నారు.



సైబరాబాద్ కమీషనరేట్ ముందు నిరసన తెలుపుతున్న బిఆర్ఎస్ మహిళా విభాగం

**రాంనగర్ చౌరస్తాలో**

**చిక్కడపల్లి మే 11 ( ప్రభాతవార్త ) :** కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడు సాయి భగీరథ్‌ను అరెస్టు చేయకుండా పోలీసులు తాత్సారం చేస్తున్నారని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ మండిపడ్డారు. సోమవారం రాంనగర్ చౌరస్తా లో స్థానిక బిఆర్ఎస్ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో కేం ద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడు సాయి భగీరథ్ దిష్టిబొమ్మను దగ్ధం చేసారు. ఈ ఆందోళన కార్యక్రమంలో ఆ పార్టీ యువనేత ముఠా జయసింహా, సీనియర్ నాయకు లు ముఠా నరేష్, గోక నవీన్, వెల్లంకి ఇంద్రసేన రెడ్డి, అస్లాం, ఖదీర్, డీన్ దయాల్ రెడ్డి, ముదిగొండ మురళి, ఎర్రం శ్రీనివాస్ గుప్తా, ఎం.రాకేష్ తదితరులు పాల్గొన్నా రు.బండి సంజయ్ కుమారుడిపై పోక్సో కేసు నమోదై నా అరెస్టు చేయడం లేదని మండిపడ్డారు. బండి సంజయ్ కేంద్రమంత్రి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశా రు. రేవంత్ రెడ్డి ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకుని బాధి త కుటుంబానికి న్యాయం చేయాలన్నారు. లేనిపక్షంలో బాధి తుల పక్షాన బీఆర్ఎస్ పార్టీ కొట్లాడుతుందని స్పష్టం చేశారు.

## మహిళలు బాగుపడితేనే సమాజం అభివృద్ధి : జస్టిస్ డా. రాధారాణి

**నాంపల్లి, మే 11 ప్రభాతవార్త :** సమాజంలో బాగుపడితేనే సమాజం అభివృద్ధి చెందుతుందని తెలంగాణ రాష్ట్ర కన్స్యూమర్స్ డిస్ప్యూట్స్ రిడ్రెసెల్ కమిషన్ మహిళా అధ్యక్షురాలు జస్టిస్ డా. జి.రాధారాణి అన్నారు. అమృతలత వివిధరంగాల్లోని మహిళల ప్రతిభాపాటవాలను గుర్తించి అవార్డులతో ప్రోత్సహించడం హర్షదాయకమని పురస్కార గ్రహీతలను అభినందించారు. ప్రముఖ రచయిత్రి, అపురూప అవార్డుల వ్యవస్థాపకురాలు డా. అమృతలత అధ్యక్షోపన్యాసంలో అవార్డుల నేపథ్యాన్ని సవివరపరిచి అందుకు సహకరించిన వారందరికీ ధన్యవాదాలు, కృతజ్ఞతలు తెలిపారు. పురస్కార గ్రహీతలకు శుభాభినందనలు తెలిపారు. అంతర్జాతీయ మాతృదినోత్సవం రోజున వివిధ రంగాల్లో నిష్ణాతులైన మహిళామణులను పురస్కారాలతో సత్కరించడం చాలా ఆనందకరంగా ఉందన్నారు. నాంపల్లిలోని సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయంలోని డా. నందమూరి తారక రామారావు కళావేదికలో డా. అమృతలత అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న జస్టిస్ డా. జి.రాధారాణి విశిష్ట అతిథి ప్రముఖ సినీనటి, ప్రఖ్యాత నాట్యకారిణి మంజుభార్గవి, ప్రముఖ కవయిత్రి, రచయిత్రి, కార్టూనిస్టు నెల్లుట్ల రమాదేవిలతో కలిసి హైమవతి భీమన్న, డా. పెళ్ళకూరు జయప్రద, బుర్రా వరహాలులను ఘనంగా సత్కరించి జ్ఞాపికతోపాటు అమృతలత జీవన సాఫల్య పురస్కారాలు; ఎం.కె.ఆర్.ఆశాలత, పి.నాగలక్ష్మి, వేపులపల్లి వాణీదేవి, డా. మైథిలి, డా. టి.శ్రీదేవిరెడ్డి, భావరాజు పద్మినీప్రియదర్శిని, అంజలి, ఎస్.మాధవి, గంగలను ఘనంగా సత్కరించి జ్ఞాపిక, అమృతలత అపురూప అవార్డులను ప్రధానంచేసి శుభాభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా జస్టిస్ జి.రాధారాణి చేతులమీదుగా అవార్డు గ్రహీతల వివరాలతో కూడిన అభినందన సావనీర్‌ను ఆవిష్కరించారు.



అవార్డు గ్రహీతలతో జస్టిస్ జి.రాధారాణి, మంజుభార్గవి, అమృతలత, రమాదేవి తదితర అతిథులు

## ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

**-మధుసూదనాచారి, ఈటల, శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్**

**హైదరాబాద్, మే 11 ప్రభాతవార్త**

ఔట్ సోర్సింగ్ ఉద్యోగులతోనే ప్రభుత్వం నడుస్తుందని, రాష్ట్ర ప్రభుత్వం నిరంకుశంగా వ్యవహరించకుండా ఉద్యోగులకు తగిన న్యాయం చేయాలని తెలంగాణ తొలి శాసనసభ స్పీకర్, ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి అన్నారు. తెలంగాణ ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల చైర్మన్ పులి లక్ష్మయ్య, బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం కాచి గూడలో కుల సంఘాలు, బీసీ సంఘాలు, ఉద్యోగ సంఘాలు, ప్రజా సంఘాలతో విస్తృత సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మధుసూదనాచారి, మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్, పార్లమెంట్ సభ్యుడు ఈటెల రాజేందర్, బీసీ జేఏసీ చైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్, హాజరైనారు. అనంతరం మధుసూదనాచారి, మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ ప్రభుత్వానికి దళారుల పట్ల ప్రేమ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులపై లేదని, దళారుల వ్యవస్థను తొలగించాలని ధ్వజమెత్తారు. సమస్యల పరిష్కారానికి ఈ నెల 25న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు వారు పేర్కొన్నారు. ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు నడి రోడ్డుపై ఉద్యమాలు చేస్తేనే ప్రభుత్వం దిగివచ్చి సమస్యలు పరిష్కారిస్తాయని వెల్లడించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 5 లక్షల మంది ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల కుటుంబాలతో ప్రభుత్వం చెలగాటం అడోద్దని, వారికి పూర్తి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఎన్నికల హామిని నేరవేర్చి, ప్రభుత్వం ఉద్యోగులతో సమానంగా అన్ని సౌకర్యాలు కల్పించాలని వెల్లడించారు. ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు పనిచేస్తున్నారని, అందుకు సమానంగా వేతనాలు, పిఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు చెల్లించాలని పేర్కొన్నారు. ఎజెన్సీలను రద్దు చేసి నేరుగా ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల ఖాతాలోకి వేతనాలు వేయాలని డిమాండ్ చేశారు. ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల బతుకులు అగమ్యగోచరంగా మారిందని, ఉద్యోగులకు వెట్టిచాకిరి తప్ప న్యాయం చేయడం లేదని ఆరోపించారు. ఇది అరంభం కాదని, అంతిమ లక్ష్యంగా ఉద్యోగులు పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో చిక్కుడు ప్రభాకర్, వేముల రామకృష్ణ, పృద్వీరాజ్ యాదవ్, బక్క జడ్సన్, శ్రీధర్, శ్రీనివాస్, సంతోష్, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.



ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలపై జరిగిన సమావేశంలో మధుసూదనాచారి, ఈటల, శ్రీనివాస్‌గౌడ్, జాజుల శ్రీనివాస్‌గౌడ్, గుజ్జ కృష్ణ తదితరులు

## ఫోక్సొకేసు విచారణ నిష్పక్షపాతంగా జరగాలంటే బండి రిజైన్ చేయాలి : దీపక్ జాన్

**సికింద్రాబాద్, మే 11 ప్రభాతవార్త:** దేశం కోసం, ధర్మం కోసం అంటూ నిత్యం ప్రగల్భాలు పలికే బీజేపీ నాయకుల అసలు రంగు బయటపడిందని సికింద్రాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు దీపక్ జాన్ విమర్శించారు. పద్మారావునగర్‌లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్‌పై వస్తున్న ఆరోపణల నేపథ్యంలో బీజేపీ మౌనాన్ని ఆయన తీవ్రంగా తప్పుబట్టారు. మైనర్ బాలికను స్నేహం పేరుతో పలుమార్లు ఫామ్ హౌస్‌కు రప్పించి, కూల్ డ్రింక్స్‌లో మత్తు మందు కలిపి అత్యాచారానికి పాల్పడినట్లు వస్తున్న వార్తలపై కమలనాథులు ఎందుకు స్పందించడం లేదని ఆయన ప్రశ్నించారు. బాధితురాలు హిందూ బాలిక అయినప్పటికీ, సొంత పార్టీ నేత కుమారుడు నిందితుడు కావడంతోనే బీజేపీ వ్యూహాత్మక మౌనం పాటిస్తోందని ఆయన మండిపడ్డారు.కంచే చేను మేసిన చందంగా బాధ్యతాయుతమైన పదవిలో ఉన్న కేంద్ర మంత్రి కుమారుడే ఇలాంటి వికృత చేష్టలకు పాల్పడటం సిగ్గుచేటని దీపక్ జాన్ ధ్వజమెత్తారు. ఈ దారుణానికి బండి సంజయ్ నైతిక బాధ్యత వహించాలని, సమాజం పట్ల బీజేపీకి కనీస బాధ్యత ఉంటే వెంటనే ఆయన్ని మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. బండి సంజయ్‌కు నిజంగానే నీతి, నిజాయితీ ఉంటే విచారణ పూర్తయ్యే వరకు తన ఎంపీ, మంత్రి పదవులకు రాజీనామా చేయాలని సూచించారు. అప్పుడే కేసు విచారణ పారదర్శకంగా, నిష్పక్షపాతంగా సాగుతుందని, బీజేపీ తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని ఆయన ఈ సందర్భంగా స్పష్టం చేశారు.



మీడియాతో మాట్లాడుతున్న జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు దీపక్ జాన్

## భారతీయ సంస్కృతిలో వివాహ బంధానికి ఎంతో ప్రాముఖ్యం



**చిక్కడపల్లి మే 11 ( ప్రభాతవార్త ):** భారతీయ సంస్కృతిలో వివాహ బంధానికి ఎంతో ప్రాముఖ్యత ఉందని ప్రవాసీ సెల్ బిజెపి తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ శ్రీ సుభాష్ అగర్వాల్, వంశీ సంస్థల అధినేత డాక్టర్ వంశీ రామరాజు, రసమయి సంస్థ అధినేత డాక్టర్ ఎంకే రాము అన్నారు. సోమవారం చిక్కడపల్లి త్యాగరాయ గానసభలో కె.వి.కె. ఫైన్ ఆర్ట్స్ అండ్ మెలోడీస్" ఆధ్వర్యంలో సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు కుప్పా వెంకట కృష్ణ మోహన్, కె. పద్మజ ఆధ్వర్యంలో గానలహరి కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా రసమయి సంస్థ ఎం కె రాముఎంకెఆర్ ఆశాలత దంపతులను, కూచిపూడి నృత్యగురువు డాక్టర్ భాగవతుల సేతురాంలక్ష్మి కనకదుర్గ, ఆధ్యాత్మికవేత్త జంధ్యాల వెంకటేశ్వర్లు హేమలత , కౌతా పద్మభ శర్మకె.బాలాత్రిపుర సుందరి, గాయకుడు బొడ్డుపల్లి శ్రీధర్ చెంచు లక్ష్మి, భాగవతుల రమణభాగవతుల కుసుమ దంపతులను ఈ సందర్భంగా సత్కరించారు. ఈ సందర్భంగా స్వరసారధ్యంలో గాయని గాయకులూ స్వప్న, శ్రీదేవి, జయలలిత, ఎం.నీరజ, స్వరకల్యాణి, రమణ రెడ్డి, బి.శ్రీధర్, ఎస్ వి .రమణ తదితరులు అద్భుతంగా గానం చేసారు. కార్యక్రమంలో మాజీ సైనికాధికారి కల్నల్ డాక్టర్ శ్రీనగేష్, సంఘసేవకుడు బి.ఖుద్దూస్ బాషా తదితరులు పాల్గొన్నారు.

**అన్నమయ్య కీర్తనల్లో సామ్యవాదం, సంస్కరణ కాంక్ష**

**చిక్కడపల్లి మే 11 ( ప్రభాతవార్త ) :** ఏ కులజుడైన నేమి ఎవ్వడైన నేమి.. అందరికీ శ్రీహరే అంతరాత్మ" అంటూ వేల సంవత్సరాల క్రితమే సమభావాన్ని బోధించిన అన్నమయ్య సాహిత్యంలో సామ్యవాదం, సంస్కరణ కాంక్ష మెండుగా ఉన్నాయని రాష్ట్ర ప్రభుత్వ పూర్వ సలహాదారు కె.వి. రమణాచారి పేర్కొన్నారు. సోమవారం చిక్కడపల్లి త్యాగరాయ గానసభ ప్రధాన వేదికపై ముంబై అన్నమయ్య కల్చరల్ సెంటర్ ఆధ్వర్యంలో అన్నమాచార్య ట్రస్ట్ స్థాపకులు బి.ఎ.వి. శాండిల్య సంస్మరణ సభ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన డాక్టర్ కెవి.రమణాచారి ప్రసంగిస్తూ శాండిల్య ముంబై, అమెరికా వంటి ప్రాంతాల్లో అన్నమయ్య కీర్తనల ప్రచారానికి విశేష కృషి చేశారని గుర్తు చేసుకున్నారు. ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచనకర్త బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖ శర్మ కార్యక్రమానికి వ్యాఖ్యాతగా వ్యవహరించగా, బాల గంధర్వం సంస్థ గురువు రామాచారి శిష్య బృందం అన్నమయ్య కీర్తనలను శ్రావ్యంగా గానం చేసి ప్రేక్షకులను ఆకట్టుకున్నారు.

## రైతులను మోసం చేసే యత్నం ...నిషేధిత పత్తి విత్తనాల స్వాధీనం

**నేరేడ్‌మెట్,మల్కాజిగిరి కమిషనరేట్, మే 11: ప్రభాతవార్త.** రైతులను నకిలీ, నిషేధిత పత్తి విత్తనాలతో మోసం చేసి అక్రమ లాభాలు ఆర్జించాలన్న యత్నాన్ని మల్కాజిగిరి కమిషనరేట్ పోలీసులు భగ్నం చేశారు. షామీర్‌పేట్ పరిధిలో నిర్వహించిన ప్రత్యేక తనిఖీల్లో 100 కిలోల నిషేధిత బీటీ3 (బీజీ III హెచ్‌పీ వెరైటీ) పత్తి విత్తనాలను స్వాధీనం చేసుకుని, అక్రమ రవాణాకు పాల్పడుతున్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు.ఎస్‌వోటీ కంటోన్మెంట్ బృందానికి అందిన విశ్వసనీయ సమాచారం మేరకు వ్యవసాయ శాఖ అధికారులు, షామీర్‌పేట్ పోలీసులతో కలిసి శనివారం సాయంత్రం ఓఆర్ఆర్ ఎగ్జిట్ నెం.7 సమీపంలో వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా అనుమానాస్పదంగా కనిపించిన వ్యక్తిని ఆపి తనిఖీ చేయగా, రెండు సంచుల్లో నిషేధిత బీటీ3 పత్తి విత్తనాలు లభ్యమయ్యాయి. మొత్తం 100 కిలోల విత్తనాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు.పోలీసుల వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం గుంటూరు జిల్లా చెబ్రోలు గ్రామానికి చెందిన దాసరి శ్రీనివాసరావు (58) ఈ అక్రమ రవాణాకు పాల్పడుతున్నట్లు గుర్తించారు. విచారణలో భాగంగా అతడు తన సహచరుడు దాసరి సూరిబాబుతో కలిసి అన్నమయ్య జిల్లా మదనపల్లి ప్రాంతానికి చెందిన వ్యక్తి వద్ద తక్కువ ధరకే విత్తనాలు కొనుగోలు చేసి, హైదరాబాద్ శివారు ప్రాంతాల్లో రైతులు, ఎరువుల దుకాణాలకు అధిక ధరల కు విక్రయించేందుకు తరలిస్తున్నట్లు వెల్లడించినట్టు పోలీసులు తెలిపారు.ఇదే తరహా కేసులో గతంలో వికారాబాద్ జిల్లా యాలాల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో కూడా నిందితుడిపై కేసు నమోదైందని అధికారులు పేర్కొన్నారు. నిషేధిత, నకిలీ విత్తనాల వినియోగం వల్ల భూమి నాణ్యత దెబ్బతినడం, పంట దిగుబడి తగ్గడం, రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని వ్యవసాయ శాఖ అధికారులు హెచ్చరించారు.ఈ ఘటనపై షామీర్‌పేట్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు. పరారీలో ఉన్న మరో ఇద్దరు నిందితుల కోసం ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలు చేపట్టినట్లు తెలిపారు.



నిందితుడి నుండి స్వాధీనం చేసుకున్న నిషేధిత బీటీ 3 పత్తి విత్తనాలు

**అలరించిన హాయి హాయిగా ఆమని సాగే సంగీత విభావరి**



గాయకులను సత్కరిస్తున్న నిర్వాహకులు

**హైదరాబాద్, మే 11, ప్రభాతవార్త:** సంగీత ప్రియులను విశేషంగా అలరిస్తూ హాయి హాయిగా ఆమని సాగే సంగీత విభావరి కార్యక్రమం విజయవంతంగా ముగిసింది. హిమాయత్‌నగర్‌లోని ఎస్ఎంఈ గ్రాండ్ లో శారద, సీతారామ్ దంపతుల నిర్వహణలో, శ్రీలక్ష్మి, అమర్‌నాథ్‌ల సమర్పణలో శారద సురాగాలు సీజన్ 3 పేరుతో జరిగిన సంగీత కార్యక్రమం ఆద్యంతం అద్భుతంగా అలరించింది. ఆదివారం ఉదయం 9 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు నిర్విరామంగా కొనసాగిన ఈ కార్యక్రమంలో అనేక మంది గాయనీ గాయకులు ఉత్సాహంగా పాటలు పాడారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రాజ్ఞిక ఆర్ట్స్ ఛీఫ్ అడ్వైజర్ ప్రవీణ్, పారిజాత, గంగోత్రి, ఈవెంట్ ఫౌండర్ త్రినాథ్, క్లాసికల్ మ్యూజిక్ గురువు తాడేపల్లి సాయిప్రసాద్, ప్లేబాక్ సింగర్ సుజాత హాజరయ్యారు. అనంతరం గాయనీ, గాయకులను శాలువాలతో, మెమెంటోలతో ఘనంగా సత్కరించి, మంచి కార్యక్రమాన్ని నిర్వహించిన నిర్వాహకులను అభినందించారు.

**అన్యాయానికి గురైన సర్పంచ్‌లకు న్యాయం జరిగేలా చూస్తా**

**సికింద్రాబాద్, మే 11 ప్రభాతవార్త:**

తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ ద్వారా అన్యాయానికి గురైన సర్పంచ్‌లకు తగిన న్యాయం జరిగేలా చూస్తానని తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ ట్రిబ్యునల్ మెంబర్ నాగులూరి కృష్ణకుమార్‌గౌడ్ తెలిపారు. సీతాఫల్‌మండిలో ఆయన విలేకరులో మాట్లాడుతూ న్యాయవాదిగా దశాబ్దాల కాలంగా పని చేస్తున్నానని, సర్పంచ్‌లు అవినీతికి పాల్పడినా, అన్యాయానికి గురైనా తనవంతు సహాయం చేస్తానన్నారు. ప్రభుత్వానికి మచ్చరాకుండా తన విధులను నిర్వహిస్తానన్నారు. తనకు పదవి రావడంలో సహకరించిన పీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్కకు, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌లతో పాటు ఇతర పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు.

**జానపద కళలు మన సంస్కృతికి నిలువుటద్దాలు**



బుర్రకథ కళాకారులను సత్కరిస్తున్న పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ పూర్వ చైర్మన్ కొల్లేటి దామోదర్ గుప్తా, చిత్రంలో త్యాగరాయగానసభ అధ్యక్షుడు కళా వి ఎస్ జనార్ధన మూర్తి తదితరులు

**చిక్కడపల్లి, మే 11,ప్రభాతవార్త :**

జానపద కళలు తెలుగు సంస్కృతికి నిలువుటద్దాలని, వాటిని భావి తరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని తెలంగాణ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ పూర్వ చైర్మన్ కొల్లేటి దామోదర్ గుప్తా అన్నారు. చిక్కడపల్లి త్యాగరాయ గానసభలోని గుండవరపు హనుమంతరావు కళా వేదిక లో గాన సభ నిర్వహణలో గాన సభ పూర్వ అధ్యక్తుడు కళా సుబ్బారావు జయంతి సందర్భంగా ఏడు రోజుల పాటు ప్రముఖులైన కళాకారులచే బుర్ర కథ సప్తాహంలో ముఖ్య అతిథిగా కొల్లేటి దామోదర్ గుప్తా పాల్గొని లక్ష్మి సన్యాసం అంశంపై అద్భుతంగా బుర్రకథను వినిపించిన ఎడ్ల ప్రేమేందర్ ను సత్కరించి మాట్లాడుతూ సాంకేతికత పెరిగిన నేటి కాలంలోనూ బుర్ర కథ వంటి కళారూపాలకు ఆదరణ తగ్గలేదని, ఇలాంటి సప్తాహాలు నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు. అనంతరం బీజేపీ నేత నైషధం సత్యనారాయణ మూర్తి మాట్లాడుతూ కళాకారులను ప్రోత్సహించడంలో త్యాగరాయ గానసభ ముందుండటం సంతోషకరమని అన్నారు.సప్తాహంలో భాగంగా ఎడ్ల ప్రేమేందర్ బృందం ప్రదర్శించిన "లక్ష్మీ సన్యాసం" బుర్రకథ ఆద్యంతం అద్భుతంగా సాగింది. తన వాగ్ధాటితో, అభినయంతో ప్రేమేందర్ ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు కళాభిమానులు, ప్రముఖులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

**వాహనాల రికవరీ ఏజెంట్ హత్య కేసులో ముగ్గురు అరెస్టు**

**-24 గంటల్లోనే కేసును ఛేదించిన బాలాపూర్ పోలీసులు**

**సరూర్‌నగర్, మే 11 ప్రభాతవార్త:** బాలాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన యువకుని హత్య కేసులో ముగ్గురు నిందితులను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. సోమవారం సాయంత్రం బాలాపూర్ పిఎస్‌లో ఇన్స్‌పెక్టర్ సుధాకర్ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆదిభట్ల ఎసిపి ప్రదీప్‌కుమార్‌రెడ్డి హత్య కేసు, నిందితుల అరెస్టు, రి మాండ్ తదితర వివరాలను వెల్లడించారు. వాహనాల రికవరీ ఏజెంట్‌గా పని చేసే కుర్మల్‌గూడ ఇందిరానగర్‌లో నివసిస్తున్న ఉత్తరప్రదేశ్ లక్నోకు చెందిన ఆదిత్ పాండే అలియాస్ భజరంగ్ (24)ను వృత్తిప రమైన విషయంలో కక్ష పెట్టుకున్న షాహీన్ నగర్ నివాసి సయ్యద్ ఇఫ్తెకార్ అలియాస్ మున్నా (25) అంతమొందించాలని నిర్ణయించాడు. ఈ నేపథ్యంలో సహచరులైన తన ప్రాంతానికి చెందిన మహ్మద్ సాహిల్ (20), బార్కాస్‌కు చెందిన అబ్దుల్లా బిన్ ఉమర్ (20)లతో కలిసి పథకం పన్నాడు. ఈ నేపథ్యంలో శనివారం రాత్రి మాట్లాడుకుందామని ముగ్గురూ ఆదిత్ పాండేను వెంటబెట్టుకొని కర్మన్ ఘాట్ వైపు తీసుకెళ్ళి మద్యం తాగారు. అనంతరం అదే రోజు రాత్రి వెంకటా పూర్ బురాన్‌ఖాన్ చెరువు సమీపంలోని ఉస్మాన్‌నగర్‌కు వచ్చి నిర్మా నుష్యంగా ఉన్న ప్రదేశంలో కర్రలు, రాళ్ళు, రాడ్‌తో దాడి చేసి అంత మొందించారు. ఈ కేసును ఛాలెంజ్‌గా తీసుకున్న ఇన్స్‌పెక్టర్ సుధాక ర్, సెక్టార్ ఎస్ఐ ప్రసాద్‌లు సిబ్బందితో కలిసి దర్యాప్తు ముమ్మరం చేసి కేవలం 24 గంటల లోపే నిందితులను గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. అయితే నిందితులకు డ్రగ్ పరీక్షలు జరపగా పాజిటివ్ వచ్చింది. దీంతో హత్య కేసుతో పాటు డ్రగ్స్ కేసును కూడా నమోదు చేసి సోమవారం సాయంత్రం రిమాండ్‌కు పంపారు. హత్య కేసు మిస్ట రీని ఛేదించి గంటల వ్యవధిలోనే నిందితులను అరెస్టు చేసిన ఇన్స్‌పెక్టర్ సుధాకర్, సెక్టార్ ఎస్ఐ ప్రసాద్‌లను ఎసిపి అభినం దించారు. ఈ మేరకు రివార్డు కోసం సిఫారసు చేసినట్లు వెల్లడించారు.

## పెళ్లికి వెళ్లివచ్చేసరికి ఇల్లు లూటీ

**హైదరాబాద్, మే 11 ప్రభాతవార్త :** దొంగలు ఒక ఇంట్లోకి చొరబడి భారీ దోపిడీకి పాల్పడ్డారు. ఈ ఘటన హైదరాబాద్ గోషామహల్ పోలీస్ స్టేషన్ పరిధిలో వెలుగుచూసింది. కుటుంబమంతా ఇంటికి తాళమేసి పెళ్లికి వెళ్లారు. తిరిగొచ్చేసరికి..దొంగలు తాళం వేసి ఉన్న ఇంటిని టార్గెట్ చేశారు. తమ ఇంటికి తాళం వేసి పెళ్లికి వెళ్లిన కుటుంబాన్ని లక్ష్యంగా పెట్టుకున్న దొంగలు ఆ ఇంట్లోకి చొరబడి భారీ దోపిడీకి పాల్పడ్డారు. జైన్ స్కూల్ సమీపంలోని ఓ ఇంట్లో ఎవరూ లేని సమయంలో దొంగలు చోరీకి పాల్పడ్డారు. తాళం పగలగొట్టి ఇంట్లోకి చొరబడ్డ దొంగలు భారీగా బంగారం, వెండి, నగదును అపహరించుకెళ్లారు. తన బంధువుల పెళ్లికి ఆదివారం ఉదయం వెళ్లి సాయంత్రం తిరిగి వచ్చేసరికి ఇంటి తాళం పగులగొట్టబడినట్లు బాధితుడు గుర్తించాడు.ఇంట్లో తనిఖీ చేయగా సుమారు 30 తులాల బంగారం, 30 తులాల వెండి, రూ.5 లక్షల నగదు దొంగిలించినట్లు తెలిసింది. బాధితుడు వెంటనే గోషామహల్ పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసిన పోలీసులు ఘటనాస్థలిని పరిశీలించి క్లూస్ టీమ్ సహాయంతో ఆధారాలు సేకరిస్తున్నారు. గోశామహల్ పోలీసులు సీసీటీవీ ఫుటేజీల ఆధారంగా దొంగల కోసం గాలింపు చేపట్టారు.

## అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

**ముషీరాబాద్, మే 11, ప్రభాతవార్త:** అనుమానాస్పద స్థితిలో ఒక వ్యక్తి మృతి చెందిన ఘటన దోమలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. దోమలగూడ సీఐ అంజద్ అలీ తెలిపిన వివరాల ప్రకారం హిమాయత్‌నగర్‌లో నివసించే వికాస్‌కరన్ (55), భార్య వర్షా కరన్‌తో విభేదాలు రావటంతో ఒంటరిగా ఉంటున్నాడు. వికాస్ కరన్ తన ఇంటిపై వచ్చే అద్దెలు తీసుకుంటూ, ఉద్యోగం చేయకుండా, మద్యానికి బానిసయ్యాడు. భార్య వర్షాకరన్ ఇద్దరు పిల్లలతో కలిసి అంబర్‌పేట్‌లో నివసిస్తూ ఉండగా, ఆదివారం రాత్రి హిమాయత్‌నగర్‌లోని ఇంట్లో అద్దెకు ఉండే వారు ఫోన్ చేసి, వికాస్ కరన్ పడిపోయి ఉన్నాడని తెలియచేశారు. వెంటనే హిమాయత్‌నగర్ ఇంటికి వచ్చిన వర్షాకరన్ 100కు ఫోన్ చేసి, పోలీసులకు సమాచారం అందించి, ఉడ్‌లాండ్ హాస్పటల్ డాక్టర్‌కు ఫోన్ చేసి, పిలిపించారు. డాక్టర్ వచ్చి, వికాస్‌ను పరీక్షించి, రెండు రోజుల క్రితమే మరణించినట్లు ధృవీకరించారు. తన భర్తకు ఆస్థుల వ్యవహారంలో గొడవలు ఉన్న నేపథ్యంలో, భర్త హఠాన్మరణంపై అనుమానం ఉందని వర్షాకరన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వర్షాకరన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు ప్రారంభించినట్లు సీఐ తెలిపారు.




మేడిపల్లి కలాన్ శివాలయంలో శ్రీభ్రమరాంబ మల్లిఖార్జున స్వామి కళ్యాణ దృశ్యం

## వైభవంగా ఆదిదంపతుల కళ్యాణం

**పూడూరు, మే 11, ప్రభాతవార్త :** పూడూరు మండలం పరిధిలోని మేడిపల్లి కలాన్ గ్రామంలో మల్లిఖార్జున స్వామి ఆలయ వార్షికోత్సవాల్లో భాగంగా చివరిరోజైన సోమవారం ఆదిదంపతుల కళ్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. ఉదయం మల్లిఖార్జునస్వామి సుప్రభాతసేవ, పల్లకిసేవ కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఎలిగేటి ప్రభాకర్‌రెడ్డి, సాయిరెడ్డిల దంపతుల అధ్వ ర్యంలో స్వామివారి కళ్యాణం జరిగింది. ఈ సందర్భంగా సర్పంచ్ టి పల్లవి రాజు, వివిధ గ్రామా లకు చెందిన భక్తులు భారీసంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన భజన మండలీలు హాజరై రాకమచెర్ల వెంకటదాసులవారి సంకీర్తనలు ఆలపించారు. దీంతో గ్రామం అంతా శివనామ స్మరణతో మార్మోగింది. ఈ సందర్భంగా హాజరైన భక్తులకు ఆలయ పూజారులు తీర్థప్రసాదాలు అందజేయగా, దాదాపురం గోపాల్‌రెడ్డి కుటుంబీకులు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

## చెక్ డ్యాం పూడ్చేస్తున్నారని ఫిర్యాదు

**ఘట్‌కేసర్ రూరల్, మే 11, ప్రభాతవార్త:** పోచారం డివిజన్ యంనంపేట్ గ్రామ పరిధిలోని బొంత కుంట వాగుపై నిర్మించిన చెక్ డ్యాంలో మట్టిని అక్రమంగా తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకో వాలని కోరుతూ డివిజన్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి మెట్టు గణేశ్ యాదవ్ సోమవారం ప్రజా వాణిలో ఫిర్యాదు చేశారు. ఓ రియల్ ఏస్టేట్ సంస్థ దాదాపు పది ఎకరాల స్థలం కొనుగోలు చేసి అపార్టుమెంటు ప్లాట్లుగా నిర్మిస్తోందని, తన భూమి పక్కనే ఉన్న బొంతకుంట వాగుపై కన్నేసిన రియల్ సంస్థ వాగులోకి మట్టిపోసి పూడ్చుతోందని వివరించారు. గతంలో వాగుపై నిర్మించిన చెక్ డ్యాంను సైతం మట్టితో పూడ్చివేస్తున్నారని చెప్పారు. బఫర్‌జోన్ నిబంధనలు పాటించకుండా వాగును ధ్వంసం చేస్తున్న వైనంపై ఇటీవల జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదు చేసినా స్పందన లేదని ఆరోపించారు.



పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసున్న బిఆర్‌ఎస్ నేతలు

## బండి భగీరథను వెంటనే అరెస్టు చేయాలి

**కేశంపేట, మే 11, ప్రభాతవార్త:** బిజెపి తెలంగాణ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు, ఎంపి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ బిఆర్‌ఎస్ నాయకులు సోమవారం పోలీసులను ఆశ్రయించారు. ఒక వ్యక్తిపై భగీరథ దాడి చేసినట్లుగా చెబుతున్న వీడియోలు సోషల్ మీడియాలో ప్రస్తావిస్తూ ఆయనపై క్రిమినల్ కేసు, ఫోక్సో కేసు నమోదు అయిన తెలంగాణ ప్రభుత్వం గానీ పోలీసు వారు గాని ఎలాంటి చర్యలు తీసుకోకుండా కాలయాపన చేస్తున్నారని బండి భగీరథను వెంటనే అరెస్టు చేసి బాధితులకు తగు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. చట్టం ఎవరికైనా ఒకటేనని అధికార పార్టీ లేదా ఎంపి కుమారుడనే కారణంతో వెనకడుగు వేయకుండా నిష్పక్షపాతంగా విచారణ జరిపించి బాధితులకు తగు న్యాయం జరిగేలా చూడాలని అన్నారు. లేనిపక్షంలో బాధితులకు న్యాయం జరిగే వరకూ తాము పోరాడుతామని బిఆర్‌ఎస్ నాయకులు స్పష్టం చేశారు. ఈ మేరకు కేశంపేట పోలీస్ స్టేషన్‌లో కేశంపేట మండలం బిఆర్‌ఎస్ నాయకులు ప్రతినిధులు లిఖితపూర్వకంగా ఎస్సై రాజ్ కుమార్‌కు ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో మండల బిఆర్‌ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు ఇవ్వాలని వినతిపత్రం

**జవహర్‌నగర్, మే 11. ప్రభాతవార్త :** అర్హులైన పేదలందరికీ డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు కేటాయించాలని కోరుతూ సిపిఐ నాయకులు సోమవారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్‌లో వినతిపత్రం సమర్పించారు. ప్రజావాణి కార్యక్రమంలో సిపిఐ మేడ్చల్ నియోజకవర్గ ఇంచార్జ్ తోటపల్లి శంకర్ నేతృత్వంలో నాయకులు కలెక్టర్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా తోటపల్లి శంకర్ మాట్లాడుతూ, గత ప్రభుత్వ హయాంలో వేలాది మంది పేదలు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్నప్పటికీ ఇప్పటికీ ఇళ్లు అందలేదని అన్నారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను వెంటనే పరిశీలించి అర్హులైన ప్రతి కుటుంబానికి ఇళ్లు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో దర్శనం యాదగిరి, స్వరూప నాయక్, అంబాల ఎల్లయ్య, కొండా సత్యం సాగర్, బి.నాని తదితరులు పాల్గొన్నారు.

## యువకుడు అదృశ్యం కేసు నమోదు

**జవహర్ నగర్,మే 11.ప్రభాత వార్త:** జవహర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధి లోని ముత్తుస్వామి కాలనీ బాలాజీ నగర్‌కు చెందిన బిస్వా కర్మ అర్జున్ తెలిపిన వివరాల ప్రకారం, ఆయన కుమారుడు టీకారాం బిస్వా కర్మ (20) పుట్టినరోజు సందర్భంగా స్నేహితులతో వేడుకలు జరుపుకున్నాడు. అనంతరం రాత్రి ఆలస్యంగా ఇంటికిరావడంతో తండ్రి మందలించారు. ఈ నెల 9వతేదీ సాయంత్రం సుమారు 5:45 గంటల సమయంలో టీకారాం మార్కెట్‌లో కూరగాయల దుకాణం వద్ద తన సెల్‌ఫోన్ వదిలి వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. కుటుంబ సభ్యులు తెలిసిన ప్రాంతాల్లో గాలించినప్పటికీ ఆచూకీ లభించలేదు. తరువాత అతని స్నేహితుడు తెలిపిన వివరాల ప్రకారం, రాత్రి ఒకటి నుంచి రెండు గంటల మధ్య టీకారాం తన ఇంటికి వచ్చి బైక్ తీసుకెళ్లాలని అడిగాడని, నిరాకరించడంతో వాహనం బుక్ చేసుకుని వెళ్తానని చెప్పి అక్కడి నుంచి వెళ్లిపోయాడని తెలిపారు. అనంతరం అతను కనిపించకుండా పోయాడు. అతను చివరిగా ఉన్న ప్రదేశం లాల్‌బజార్‌గా గుర్తించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



### యువకుడు అదృశ్యం
## తల్లి ఫిర్యాదుతో కేసు నమోదు

**జవహర్‌నగర్,మే 11.ప్రభాతవార్త:** జవహర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని నందమూరి నగర్, అంబేద్కర్ నగర్‌కు చెందిన నిషా తెలిపిన వివరాల ప్రకారం, ఆమె చిన్న కుమారుడు రబ్బాని అన్సారీ (26) స్థానికంగా పంచర్ దుకాణంలో పనిచేస్తున్నాడు. ఈ నెల 8వ తేదీ సాయంత్రం మద్యం సేవించి ఇంటికి రావడంతో తల్లి అతన్ని మందలించింది. తరువాతి రోజు ఉదయం ఆరు గంటల సమయంలో అన్సారీ ఇంట్లో కనిపించకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందారు. అతని సెల్‌ఫోన్‌కు పలుమార్లు ప్రయత్నించినప్పటికీ స్విచ్ ఆఫ్ వస్తోందని తెలిపారు. బంధువుల ఇళ్లలో, పరిసర ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. ఈ ఘటనపై తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు అదృశ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు



## పేకాటరాయుళ్ల అరెస్టు

**వికారాబాద్, ప్రభాతవార్త :** జిల్లా ఎస్పి స్నేహ మెహ్రా ఆదేశాల మేరకు సోమవారం పేకాట స్థావరం పై దాడీ చేసి 7 మంది పేకాటరాయుళ్ళను అరెస్టు చేసినట్లు జిల్లా టాస్క్ ఫోర్స్ ఇన్స్పెక్టర్ అన్వార్ పాషా తెలిపారు. విశ్వసనీయ సమాచారం మేరకు, వికారాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని అలంపల్లి ప్రభుత్వ పాఠశాల సమీపంలో పేకాట ఆడుతున్న స్థావరంపై టాస్క్ ఫోర్స్ బృందం ఆకస్మిక దాడి నిర్వహించి, పేకాట ఆడుతున్న ఏడుగురు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకోవడం జరిగిందని ఆయన తెలిపారు. పట్టుబడిన వారిలో ధారూర్ మండలం అల్లీపూర్ గ్రామానికి చెందిన గౌరప్ప, ఈ.గోపాల్, గంధం గోపాల్, కె. బాలయ్య, ఈ.హరీష్‌లతో పాటు మర్పల్లి మండలం కోటమర్పల్లికి చెందిన ఎస్.వెంకట్ రెడ్డి, వికారాబాద్‌కు చెందిన బి.శ్రీనివాస్ రెడ్డిలను అదుపులోకి తీసుకున్నట్లు పేర్కొన్నారు. నిందితుల వద్ద నుండి రూ.26,355 నగదు స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. అదుపులోకి తీసుకున్న నిందితులను, నగదును తదుపరి చట్టపరమైన చర్యల నిమిత్తం వికారాబాద్ టౌన్ పోలీస్ స్టేషన్ కు అప్పగించినట్లు ఇన్స్పెక్టర్ అన్వార్ పాషా తెలిపారు.

## ఉత్తమ విద్యార్థులకు రవీంద్రభారతిలో సన్మానం



**మర్పల్లి మే 11ప్రభాతవార్త:** పదవతరగతి పరీక్షలలో మండలంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థిని,విద్యార్థులకు మహాత్మా జ్యోతిరావుపూలే ప్రతిభాపురస్కారాలు 2026 ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయిలో విద్యార్థిని,విద్యార్థులను రవీంద్రభారతీలో సన్మా నించడం జరిగింది.మర్పల్లి మండలంల ఘణాపూర్ జడ్పీహెచ్‌యస్ విద్యారి ఎంపిడిని పట్లోళ్ళ చైతన్య పదవతరగతి పరీక్షలలో 600గాను 548 మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచిన విద్యార్థినికి మరియు ప్రధానోపాద్యాయులైనా అశోక్‌ను రవీంద్ర భారతీలో సన్మానించారు.ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాస్, సదాలక్ష్మీ,మోహన్‌రెడ్డి,నర్సిఁములుసిఆర్‌పి మల్లేశం ,తదితరులు పాల్గొన్నారు.

## ఆర్‌ఓబి పెండింగ్ పనులు పూర్తి చేయాలని వినతి



ఆర్‌అండ్‌బి ఈఈ రమేశ్‌కు వినతిపత్రం అందజేస్తున్న మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ పావని జంగయ్యయాదవ్

**ఘట్‌కేసర్, మే 11, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్‌లో నిర్మిస్తున్న రైల్వేవంతెన పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఘట్‌కేసర్ మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ముల్లి పావని జంగయ్యయాదవ్ సోమవారం రోడ్లు భవనాలశాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రమేశ్‌కు వినతిపత్రం అందజేశారు. వంతెన నిర్మాణ పనులకు సంబంధించి పెండింగ్ బిల్లు కాంట్రాక్టర్‌కు చెల్లించినందున మిగిలిపోయిన పనులను త్వరగా చేపట్టి ఆర్‌ఓబిని ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆమె కోరారు. వంతెన నిర్మాణ పనులు ఆలస్యంగా జరుగుతుండటంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని త్వరగా పూర్తి చేసేలా కాంట్రాక్టర్‌ను ఆదేశించాలని ఈఈ రమేశ్‌కు ఆమె విజ్ఞప్తి చేశారు. ఈకార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ కడుపొల్ల మల్లేశ్, మాజీ సర్పంచ్ డక్కి రమేశ్, మాజీ డిసిసి కార్యదర్శి ఉల్లి అంజనేయులు, మాజీ వార్డుసభ్యులు కొరుబోతు నాగరాజు, నాయకులు సల్మాన్‌రాజ్, సాయియాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## తల్లిని ప్రతిరోజూ గౌరవించుకోవాలి

**సంజీవరెడ్డి నగర్, మే 11, ప్రభాతవార్త:** తన ప్రాణాలను పణంగా పెట్టి మనకు జన్మనిచ్చిన తల్లిని ప్రతిరోజూ గౌరవించుకోవాలని, అప్పుడే మన జన్మకు సార్థకత కలుగుతుందని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. సోమ వారం బల్కంపేటలోని ఎస్ఎస్ కన్వెన్షన్‌లో మాతృదినో త్సవం సందర్భంగా నిర్వహించిన సామూహిక శ్రీమంతా ల కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ముందుగా గర్భిణీ మహిళలతో కలిసి కేక్ కట్ చేసి వేడు కలను ప్రారంభించారు.ఈ సందర్భంగా గర్భిణీ మహిళల కు చీరలు, పండ్లు, స్వీట్లు అందజేసి ఆశీర్వదించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అమ్మ లేకపోతే మనం లేమనే విషయం ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని అన్నారు. మాతృదినోత్స వాన్ని పురస్కరించుకుని 150 మంది గర్భిణీలకు సామూహిక శ్రీమంతాలు నిర్వహిం చడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమా న్ని నిర్వహించిన రోజా రెడ్డి, మాజీ కార్పొరేటర్ నామన శేషుకుమారి, బీఆర్ఎస్ నాయకులు ప్రవీణ్ రెడ్డి, కరుణా కర్ రెడ్డిలను అభినందించారు.తల్లి నవమాసాలు గర్భం లో మోసి జన్మనివ్వడమే కాకుండా పిల్లలను మంచి ప్ర యోజకులుగా తీర్చిదిద్దేందుకు ఎన్నో కష్టాలు పడుతుం దని చెప్పారు.



సామూహిక శ్రీమంతాల కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే తలసాని

తల్లి-బిడ్డల బంధం ఎంతో గొప్పదని, త్యాగం, ప్రేమకు ప్రతీకగా నిలిచే మాతృమూర్తిని ఎంత గౌరవించినా తక్కువేనని పేర్కొన్నారు.నేటి తరానికి తల్లి విలువ, మన సంస్కృతి, సాంప్రదాయాలపై అవగాహన తగ్గిపోతుండడం బాధాకరమని అన్నారు. పండుగల విశిష్టత, భారతీయ ఆచార సంప్రదాయాల గురించి పిల్లలకు తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రపంచ దేశాలు కూడా భారతీయ సంప్రదాయాలను గొప్పగా భావిస్తూ ఆచరిస్తున్నాయని చెప్పారు.గర్భిణీలు తమ ఆరోగ్యంతో పాటు పుట్టబోయే బిడ్డ ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని సరైన ఆహారం తీసుకుంటూ జాగ్రత్త లు పాటించాలని సూచించారు. కేసీఆర్ ప్రభుత్వం హ యాంలో ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవించిన వారికి కేసీ ఆర్ కిట్ ద్వారా తల్లి, శిశువుకు అవసరమైన వస్తువులు అందించడంతో పాటు ఆడబిడ్డ పుడితే రూ.13 వేల, మగబిడ్డ పుడితే రూ.12 వేల ఆర్థిక సహాయం అందిం చామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత కేసీఆర్ కిట్ పంపిణీ నిలిపివేసిందని విమర్శించారు.ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ నామన శేషుకుమారి, రోజా రెడ్డి, నాగలక్ష్మి ్మ, కావేరి, నీరా గుప్త, నాయకులు ప్రవీణ్ రెడ్డి, కరుణాకర్ రెడ్డి, నామన సంతోష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## చిన్నారుల కోసం రోడ్డు భద్రతపై వేసవి శిబిరం

**గోషామహల్,మే11(ప్రభాతవార్త)**

గోషామహల్‌లోని ట్రాఫిక్ ట్రెనింగ్ ఇన్‌స్టిట్యూట్‌లో చిన్నారుల కోసం ఏర్పాటు చేసిన రోడ్డు భద్రత వేసవి శిబిరం2026 ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా హైదరాబాద్ ట్రాఫిక్ జాయింట్ కమిషనర్ ఆఫ్ పోలీసు డి.జోయల్ డేవిస్,ఐపిఎస్ హాజరై ప్రారంభించారు.ఈ సందర్భముగా మాట్లాడుతూ.. చిన్నారుల కోసం ఏర్పాటు చేసిన వేసవి శిబిరంలో 10నుండి 15 సంవత్సరాల మధ్య వయస్సు గల చిన్నారుల కోసం ఈ శిబిరాన్ని రూపొందించామన్నారు.ఇందులో రోడ్డు భద్రత, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహనతో పాటు ప్రాథమిక చికిత్స, నృత్యం,సంగీతం,చిత్రలేఖనం,చేతి వ్రాత మెరుగుదల,వ్యక్తిత్వ వికాసం,అగ్నిమాపక భద్రత వంటి వివిధ అంశాలపై శిక్షణ ఇస్తారని తెలిపారు.చిన్నారులకు చిన్నతనం నుండే రోడ్డు భద్ర తపై అవగాహన కల్పించడం ద్వారా భవిష్యత్తులో రోడ్డు ప్రమాదాలను,ప్రాణనష్టాన్ని తగ్గించడం ఈ శిబిరం ప్రధాన ఉద్దేశ్యం అన్నారు.ఈ ఏడాది మొత్తం 100 మంది చిన్నారులు ఈ శిబిరంలో పేరు నమోదు చేసుకున్నారని వివరించారుగొప్ప కలలు కని,ఉన్నత శిఖరాలను అధిరోహించాలని,దేశం గర్విం చేలా ఎదిగి తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని కోరుతూ పలువురు విజేతల జీవితాలను ఉదాహరణలతో విద్యార్థులవివరించారు.ఇక్కడ నేర్చుకున్న రోడ్డు భద్రత నియ మాలను మీ తల్లిదండ్రులకు,స్నేహితులకు,బంధువులకు వివ రించి,మీరు సమాజంలో ట్రాఫిక్ రాయబారులుగా మారాలి పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ 2డి.సి.పి.కాజల్ సింగ్,హోండా గ్రూప్ జి.ఎమ్.చతుర్వేది,ఆర్యన్ డాన్స్ అకాడమీ సరోజ్ బాలా,రాజ్ ఈవెంట్స్ అనంత్ రాజ్ తదితర శిక్షకులు,అధికారులు పాల్గొన్నారు.



చిన్నారులతో జాయింట్ కమిషనర్ జోయల్ డేవిస్,

## మోదీ సభను విజయవంతం చేసిన బిజెపి కార్యకర్తలకు అభినందనలు : ఈటల



మీడియాతో మాట్లాడుతున్న ఎంపీ ఈటెల రాజేందర్

**కంటోన్మెంట్,మే 11 ప్రభాతవార్త:**

సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో ఈ నెల 10న నిర్వహిం చిన ప్రధాని మోదీ బహిరంగ సభ కనీ,వినీ ఎరుగని రీతిలో విజయవంతంగా జరిగినందుకు అందుకు సహక రించిన బిజెపి నాయకులు, కార్యకర్తలకు అభినందనలు తెలుపుతున్నామని మల్కాజిగిరి ఎంపీ ఈటెల రాజేందర్ తెలిపారు. సోమవారం డైమాండ్ పాయింట్‌లోని గాయిత్రి గార్డెన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తన పార్లమెంట్ పరిధిలోని మల్కాజిగిరి, మేడ్చెల్,సికింద్రాబాద్,రంగారెడ్డి జిల్లాల అధ్యక్షులు,ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు,కార్యకర్త లతో పాటు ప్రజలు స్వచ్ఛందంగా మోదీ సభకు రావడం తో విజయవంతమైందన్నారు. ఈ సభకు మల్కాజిగిరి పార్లమెంట్ నుంచి పెద్ద సంఖ్యలో తలివచ్చారన్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణ గడ్డమీద బిజెపి అత్య ధిక స్థానాలు కైవసం చేసుకొని బిజెపి ప్రభుత్వం అధికా రంలోకి వస్తుందని దీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ప్రజా సమస్యలు పట్టించుకునే ఏకైకా పార్టీ బిజెపి అన్నా రు. మోదీ 3వ సారి ప్రధాని అయ్యాక ప్రతి రాష్ట్రంలో బిజెపి అధికారంలో వచ్చేందుకు విస్తరిస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వ నిధులతోనే రాష్ట్రాబివృద్ధి జరుగతుంద న్నా రు. ఈ కార్యక్రమంలో కంటోన్మెంట్ నామినేటెడ్ మెంబర్ బానుక నర్మధ, మహంకాళి జిల్లా ఉపాధ్యక్షులు బి.ఎన్. శ్రీనివాస్, నాయకులు బానుక మల్లికార్జున్, చెన్నారావ్, విశాలిని, విజయానంద్, సుబ్బారావ్, కట్ట కుమార్, పద్మ, ఆర్.కె.శ్రీనివాస్,గిరి, బానుప్రకాశ్ పాల్గొన్నారు.

### నేత్రపర్వం గంగావతరణం
## కూచిపూడి దృశ్యరూపకం

**రవీంద్రభారతి, మే 11 ప్రభాతవార్త :**

మహాబుషి. జ్ఞాని, జ్ఞానపీఠ అవార్డు గ్రహీ త, పద్మభూషణ్ డా. సి.నారాయణరెడ్డి సీతా కళ్యాణం కోసం 1976లో ఆయన కలం నుండి జాలువారిన కళాఖండం గంగావతర ణం కూచిపూడి దృశ్యరూపకం నయనానం దంగా ప్రదర్శింపబడి గొప్ప అనుభూతిని కల్గించి భక్తిపారవశ్యంలో ముంచెత్తివేసిందని వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వవి ద్యాలయం ఉపాధ్యక్షురాలు ఆచార్య సూర్య ధనుంజయ్ అన్నారు. భువి నుండి దివికి దిగివచ్చిన గంగను, శివుడుని, భగీరథుడ్ని ఈ రోజు గంగావతరణం కూచిపూడి దృశ్య రూపకం ద్వారా చూడగలిగామన్నారు. నేడు కావ్యేషు నాటకం రమ్యం, రమణీయమైందని, మనకు ప్రత్యక్ష అనుభవం కలిగించిందని, వినోదాన్ని, విజ్ఞానాన్ని అందించిందని కొని యాడారు. ప్రదర్శనలో పాల్గొన్న నర్తకీమణు లందరికీ అభినందనలు తెలిపారు. నృత్యకిన్నెర ఆధ్వర్యంలో రవీంద్రభారతి ప్రధానమం దిరంలో నేత్రపర్వంగా ప్రదర్శింపబడిన గంగావతరణం కూచిపూడి దృశ్యరూపకం సభా కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆచార్య సూర్య ధనుంజయ్ విశిష్ట అతిథులు డా. జుర్రు చెన్నయ్య, మద్దాళి రఘురామ్, ఉషాగాయత్రి, సౌందర్య కౌశిక్ తదితరులతో కలిసి మద్దాళి సౌందర్యతోపాటు ముఖ్య పాత్రల్లో పరమశివుడుగా శ్రద్ధ, భగీరథుడుగా సమిత, నంది పాత్రలలో మాన్విత, లక్ష్య, సహస్ర, రుత్వికలు తమ నృత్యాభినయంతో తన్మయుల్ని చేసిన కళాకారులను ఘనంగా సత్కరించి ఎంతగానో అభినందించారు.

### దేశంలోనే ప్రతిష్టాత్మకమైన విద్యా సంస్థ సిటీ కళాశాల

**చార్మినార్,మే 11 ప్రభాతవార్త :** పాతబస్తీలో ఉన్న ప్రభుత్వ సిటీ కళాశాల దేశంలోనే ప్రతి ష్టాత్మకమైన విద్యా సంస్థ అని చార్మినార్ ఎమ్మెల్యే మీర్ జుల్ఫికర్ అలీ అన్నారు. ప్రభుత్వ సిటీ కళాశాలలో సోమవారం జరిగిన విద్యా వారోత్సవ సభలో ఆయన పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మీర్ జుల్ఫికర్ అలీ మాట్లాడుతూ నేను సిటీ కళాశాలలో చదువుకున్నానని,సిటీ కళాశాల అభివృద్దికి అన్ని విధాల తన వంతు సహకా రాన్ని అందిస్తానని తెలిపారు.విద్యా వారోత్స వాల బ్రోచర్‌ను ఆయన విడుదల చేశారు.

### శక్తికి, పరాక్రమానికి ప్రతీక పంచముఖ హనుమాన్ : ఎమ్మెల్యే కెపి



ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే వివేకానంద్

**జీడిమెట్ల, మే 11, ప్రభాతవార్త**

125 గాజులరామారం డివిజన్ మహాదేవపురం శ్రీశ్రీశ్రీ షిర్డీ సాయి బాబా దేవాలయంలో నిర్వహించిన పంచముఖ హనుమాన్, నవగ్ర హాల ప్రతిష్టాపన కార్యక్రమానికి బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ ముఖ్య ఆతిధిగా హాజరై పంచముఖ హనుమాన్ ప్రతిష్టాపన ప్రత్యేక పూజలు గావించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శక్తికి, పరాక్రమానికి ప్రతీక పంచముఖ హనుమాన్ అని, పంచముఖి హనుమాన్ స్వామి వారి ఆశీస్సులు భక్తులపై సంపూర్ణంగా ఉండాలన్నారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు దుగ్యాల సాయి ప్రసాద్, రవీందర్ రెడ్డి, సింహాచలం, ప్రభాకర్ రెడ్డి, నవీన్, రంగారావు, పాక్స్ డైరెక్టర్ పరుశ శ్రీనివాస్ యాదవ్, డివిజన్ అధ్యక్షులు విజయ్ రాంరెడ్డి, సీనియర్ నాయ కులు అడ్వకేట్ కమలాకర్, నవాబ్, ఇమ్రాన్ బేగ్, మూసా ఖాన్, బోయిని మహేష్, చిన్నా చౌదరి, సాయిబాబా, రాములు గౌడ్, నవీన్, మహేష్, శ్రావణ్, ప్రసాద్, శివా నాయక్ పాల్గొన్నారు.

## నిజాంపేట్ డిప్యూటీ కమిషనర్‌పై విజిలెన్స్ విచారణ జరపాలి : ఆకుల సతీష్



**నిజాంపేట్, మే 11, ప్రభాతవార్త**

నిజాంపేట్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్‌పై వచ్చిన అవినీతి, అక్రమా లు, విధుల నిర్లక్ష ్య ఆరోపణల నేపథ్యంలో ఆయనను తక్షణమే బదిలీ చేసి సమగ్ర విజిలెన్స్ విచారణ చేపట్టాలని సామాజిక కార్య కర్త ఆకుల సతీష్ డిమాండ్ చేశారు.2023 ఆగస్టులో బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి నిజాంపేట్ సర్కిల్ పరిధిలో ప్రభుత్వ భూములపై అక్రమ ఆక్రమణలు, అనధికార నిర్మాణాలు, పార్కుల్లో నిర్మాణాలు జరుగుతున్నప్పటికీ పలుమార్లు ఫిర్యాదులు చేసినా అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆరోపించారు.డంపింగ్ యార్డ్ సమస్యను పరిష్కరించకుండా అక్కడ రూ.3.5 కోట్ల బిల్లుల చెల్లింపుల కోసం కమిషన్లు వసూలు చేస్తున్నారనే ఆరోపణ లు ఉన్నాయని తెలిపారు. ఇంజినీరింగ్ విభాగంలో నాసిరకం పనులు, బిల్లుల చెల్లింపుల్లో అక్రమాలు, అక్రమ హోల్డింగ్లు, టీఎస్‌బీపాస్ ఇన్‌స్టంట్ అనుమతుల పేరుతో సుమారు 150 అక్రమ అంతస్తుల నిర్మాణాలకు వసూళ్లు జరిగినట్లు ఆరోపించారు.గత ఏడాది నవంబర్‌లో నిజాంపేట్ సర్కిల్ కమిషనర్‌ను తొలగించాలని ప్రజలతో కలిసి ధర్నా నిర్వహించినప్పటికీ అధికారులు స్పందించ లేదని పేర్కొన్నారు. అనంతరం నిజాంపేట్ సర్కిల్ గ్రేటర్ హైద రాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో విలీనమయ్యే సమయంలో జరిగిన అక్రమాలపై ప్రభుత్వం విజిలెన్స్ విచారణ ప్రారంభించిన ప్పటికీ, ఇప్పటివరకు నివేదికను బహిర్గతం చేయలేదని విమర్శిం చారు.ఈ నేపథ్యంలో పూర్తి ఆధారాలతో సోమవారం సృజనకు ఫిర్యాదు చేసినట్లు ఆకుల సతీష్ తెలిపారు. డిప్యూటీ కమిషనర్‌ని వెంటనే బదిలీ చేసి, అన్ని ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపి చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో అరుణ్ రావు, అంకం సతీష్, పండు పాల్గొన్నారు.



వెస్ట్ మారేడ్‌పల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యా వారోత్సవాల బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేష్

### ప్రభుత్వ విద్యాలయాల అభివృద్ధికి కృషి : ఎమ్మెల్యే శ్రీగణేష్

**అడ్డగుట్ట,మే 11 ప్రభాతవార్త:** ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులు విద్యాపరంగా అభివృద్ధి చెందాలని, కార్పోరేట్ కళాశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో విద్యాభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక నిధులు విడుదల చేస్తుందని కంటోన్మెంట్ ఎమ్మెల్యే ఎన్.శ్రీగణేష్ తెలిపారు. ప్రజా పాలన ప్రగతిప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా సో మవారం వెస్ట్ మారేడ్‌పల్లిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన విద్యా వారోత్సవాల కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసం గించారు. కళాశాల అభివృద్ధికి,విద్యార్థులకు అవసరమైన తరగతి గదుల నిర్మాణం కోసం ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేయిస్తామన్నారు. ముందుగా కళాశాలలో నూ తనంగా ఏర్పాటు చేసిన ల్యాబ్‌లను ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఏ.భాగ్యలక్ష్మి, సీనియర్ కాంగ్రెస్ నేతలు సంతోష్ యాదవ్, చిర్రబోయిన వైష్ణవి యాదవ్, సి.సంతోష్ యాదవ్,బద్రి యాదవ్,అల్లాడి గౌరి శంకర్,నందికంటి రవి నాగేశ్ యాదవ్, గణేష్ దేవాలయం చైర్మన్ ప్రభాకర్ యాదవ్, నర్సింగ్ రావ్ తదితరులు పాల్గొన్నారు.

## వడ్డెర కార్పొరేషన్ చైర్మన్‌గా రేణుకను వ్యతిరేకించడం దుర్మార్గం




**సైఫాబాద్, మే 11 ప్రభాతవార్త:** వడ్డెర కో-ఆపరేటివ్ కార్పొరేషన్ చైర్మన్‌గా గుంజ రేణుకానారాయణ నియామకాన్ని వ్యతిరేకించడం దుర్మార్గమని, అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం కృషి చేస్తున్న కాంగ్రెస్ పార్టీని విమర్శిస్తే సహించేది లేదని తగిన బుద్ధిచెపు తామని అఖిల భారత వడ్డెర సంక్షేమ సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రమేష్ మంజులా హెచ్చరించారు. రేణుకానారాయణను చైర్మన్‌గా నియమించినందుకు ఆయన సిఎం రేవంత్‌రెడ్డి, పిసిసి అధ్యక్షుడు బి.మహేష్‌కుమార్‌గౌడ్‌కు కృతజ్ఞతలు తెలియజేయడం జరిగిందన్నారు. సోమవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏరా ్పటు చేసిన మీడియా సమావేశంలో సంఘం మహిళా విభాగం అధ్యక్షు రాలు కుంచపు రామా, హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు రాపెన్ గిరిబాబు, నాయకులు ఎం.హనుమంతు, డి.కృష్ణతో కలిసి రమేష్ మాట్లాడుతూ దివంగత సిఎం వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి వడ్డెర కులస్తులు ఎంతో వెనుకబడి ఉన్నారని గుర్తించి వడ్డెర ఫెడరేషన్ ఏర్పాటు చేసి వారి సంక్షేమం కోసం రుణాల మంజూరు చేయడం జరిగిందని గుర్తు చేశారు. అనంతరం అధికారంలోకి వచ్చిన బిఆర్ ఎస్ ప్రభుత్వం వడ్డెర ఫెడరేషన్‌కు నిధులు కేటాయించకుండా నిర్లక్ష్యం చేసిందని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ నాయకురాలు, పేదలకు విశేషమైన సేవలు అందించిన రేణుకానారాయణకు ప్రభు త్వం వడ్డెర కార్పొరేషన్ చైర్మన్‌గా నియమించిందన్నారు. బిఆర్ఎస్ పార్టీకి చెందిన వడ్డెర కుల ద్రోహులు కొంతమంది ఆమె నియామ కాన్ని వ్యతిరేకిస్తున్నారని ఆయన ఆరోపించారు. బిఆర్ఎస్ ప్రభు త్వం ఫెడరేషన్‌కు ఎందుకు నిధులు కేటాయించలేదని ఆయన ప్ర శ్నించారు. వడ్డెర జాతి కాంగ్రెస్ పార్టీ వెనుకాలే ఉందని, భవిష్యత్తులో కూడా ఉంటుందని రమేష్ స్పష్టం చేశారు.



మేడ్చల్‌లో బండి సంజయ్, బండి భగీరథ దిష్టిబొమ్మను దగ్ధం చేస్తున్న బిఆర్ఎస్ నాయకులు

## బండి సంజయ్, బండి భగీరథ దిష్టిబొమ్మ దగ్ధం

**మేడ్చల్, మే 11, ప్రభాతవార్త :** బండి భగీరథను అరెస్టు చేయాలని బిఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేస్తూ మేడ్చల్‌లో కేంద్రమంత్రి బండి సంజయ్, ఆయన కుమారుడు భగీరథ దిష్టి బొమ్మను దగ్ధం చేశారు. భగీరథను వెంటనే అరెస్టు చేయాలని ఈ సందర్భంగా జిల్లా గ్రంథాయల సంస్థ మాజీ చైర్మన్ భాస్కర్ యాదవ్ డిమాండ్ చేశాడు. కాంగ్రెస్ పాలనలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందని ఆయన ఆరోపించాడు. ఈ కార్యక్రమంలో ఎల్లంపేట మున్సిపల్ చైర్మన్ శ్రీదేవి, కౌన్సిలర్ నిషిత, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, దయానంద్ యాదవ్, విష్ణు చారీ, గోపాల్‌రెడ్డి, గణేష్, నవీన్‌రెడ్డి, రాగజ్యోతి, హరిత్‌రెడ్డి, దర్శన్ తదితరులు పాల్గొన్నారు.

## బండి సాయి భగీరథ్‌ను వెంటనే అరెస్టు చేయాలి



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న బిఆర్ఎస్ నాయకులు

**మోమిన్‌పేట్, మే 11, ప్రభాతవార్త:** 17 సంవత్సరాల మైనర్ బాలికను హత్యాచారం చేసి తప్పించుకుని తిరుగుతున్న కేంద్ర సహాయమంత్రి అయిన బండి సంజయ్ కుమారుడు బండి సాయి భగీరథ్ వెంటనే అరెస్టు చేయాలని మోమిన్‌పేట్ మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు దబ్బని వెంకట్ డిమాండ్ చేశారు. సోమవారం మండల పార్టీ కార్యాలయంతో జిల్లా పార్టీ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ పిలుపు మేరకు మండల పార్టీ నాయకుల ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ కొడుకు బండి సాయి భగీరథ్‌ను వెంటనే అరెస్టు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. తన కుమారుడు ఎలాంటి తప్పు చేయలేదని అంటున్న కేంద్ర సహాయ మంత్రి పదవికి బండి సంజయ్ అనర్హుడని, తక్షణమే పదవికి రాజీనామ చేసి తన కొడుకును పోలీసులకు అప్పజెప్పాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో బిఆర్ఎస్ పార్టీపక్షాన నిన్ను ఎక్కడికక్కడ అడ్డుకుంటామని హెచ్చరించారు. అదే విధంగా రాష్ట్రంలో 8మంది బిజెపి ఎంపీలు ఉన్న తెలంగాణ రాష్ట్రం కోసం పార్లమెంటులో మాట్లాడిన సందర్భం ఒక్కటి కూడా లేదని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు అగమ్య గోచరంగా ఉన్నప్పటికి కూడా హోం మంత్రి లేకపోవడం విడ్డూరమని వారు అన్నారు. రాష్ట్రంలో ఇంత ఘోరంగా మహిళలపై అత్యాచారాలు జరుగుతున్న బిజెపి మహిళా ఎమ్మెల్యేలు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మరియూ మహిళా కాంగ్రెస్ ఎమ్మెల్యేలు స్పందికపోవడం శోచనీయమని, దీనిని బట్టి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, కేంద్ర హోం సహాయకమంత్రి బండి సంజయ్ ఇద్దరు కుమ్ముక్కయ్యారని, లేని పక్షంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ స్పందించి బండి సంజయ్‌ని మంత్రి పదవినుండి వెంటనే బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ సర్పంచులు, సీనియర్ నాయకులు, అభిమానులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## నేడు టెన్త్ ఇంటర్ ప్రతిభావంతులకు ఎబివిపి ఆధ్వర్యంలో సన్మానం

**దౌల్తాబాద్, మే 11, ప్రభాతవార్త:**

అఖిల భారతీయ విద్యార్థి పరిషత్(ఏబీవీపీ) ఆధ్వర్యంలో నేడు అనగా మంగళవారంరోజు చంద్రకల్ గ్రామంలోని బసవేశ్వర దేవాలయ ప్రాంగణంలో ప్రతిభావంతులైన టెన్త్,ఇంటర్ విద్యార్థులకు ప్రత్యేక సన్మాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎబివిపి జాతీయ నాయకులు మొగులప్ప ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఏడాది పదవ తరగతి, ఇంటరీడియట్ ద్వితీయ సంవత్సర పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించి ఉత్తీర్ణులైన విద్యార్థులకు ఈ సందర్భంగా ఘనంగా సన్మానించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా స్వదేశీ జాగరణ మంచ్ మూడు రాష్ట్రాల ఇంచార్జ్ సత్తు లింగమూర్తి, దౌల్తాబాద్ ఎస్ఐ వేణుకుమార్, ఏబీవీపీ విభాగ్ సంఘటనా కార్యదర్శి కాయం నరేంద్ర తదితరులు హాజరుకానున్నారన్నారు. ఈ కార్యక్రమానికి విద్యార్థులు, వారి తల్లి దండ్రులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ఎబివిపి నాయకులు మొగులప్ప, చిట్టం నారాయణరెడ్డి, గొల్ల అరవింద్ తదితరులు తెలిపారు.



## సమ్మర్‌క్యాంపును సద్వినియోగం చేసుకోండి

**మర్పల్లి మే 11 ప్రభాతవార్త :** ప్రధానోపాధ్యాయులు అంజిలయ్య వికారాబాద్ డిఇఓ ఆదేశానుసారం విద్యావారోత్సవాల సందర్భంగా పిఎం శ్రీమర్పల్లి పాఠశాలలో ప్రారంభించినట్లు అందరు విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలనీ మర్పల్లి ప్రధానోపాధ్యాయులు కే.అంజిలయ్య తెలిపారు. ఎంపిడిఓ శ్రీనివాస్, ఎంఇఓ అశోక్, వ్యామలసనీల్‌లు మాట్లాడుతూ వేసవిలో విద్యార్థిని విద్యార్థులు తమ సమయాన్ని వృదా చేసుకుని విద్యకు దూరమవుతారనీ ఈసమ్మర్ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలనీ వారు సూచించారు. మర్పల్లి సర్పంచ్ ఎం.రమేశ్వర్ మాట్లాడుతూ విద్యార్థులు స్మార్ట్‌ఫోన్లకు దూరంగా ఉండి తమ విద్యపై మక్కువ పెంచుకుని జీవితంలో రాణించాలనీ తల్లి తండ్రులు తమ పిల్లల పట్ల శ్రద్దవహించాలనీ ఆయన సూచించారు. అనంతరం విద్యార్థులు, ఉపాధ్యాయులు కలసి క్రికెట్ ఆడారు.

### నిద్రమత్తులో కారు డ్రైవింగ్...

## ఓఆర్ఆర్‌పై వాహనాన్ని ఢీ

### తీవ్ర గాయాలై చికిత్స పొందుతూ మృతి



ప్రమాదంలో దెబ్బతిన్న బ్రెజ కారు

**ఘట్‌కేసర్, మే 11, ప్రభాతవార్త:** నిద్రమత్తులో ముందుగా వెళ్తున్న వాహనాన్ని కారు ఢీకొట్టగా ఓవ్యక్తి తీవ్ర గాయాలై ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందిన సంఘటన ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సిద్దిపేట్ జిల్లా కుకునూరుపల్లికి చెందిన బోడపట్ల రమేశ్ (27) ఆదివారం తన స్నేహితులైన కల్కి ముత్యం, ఫణింధర్‌తో కలిసి ఎల్‌బినగర్‌కు వచ్చి తిరిగి తన స్విఫ్ట్ బ్రెజా కారు (టిఎస్07ఎఫ్‌జడ్-2589)లో వెళ్తుండగా ప్రమాదానికి గురయ్యారు. పెద్ద అంబర్‌పేట్ నుంచి ఓఆర్ఆర్ మీదుగా శామీర్‌పేట్ వెళ్తుండగా ఆదివారం రాత్రి 10 గంటల సమయంలో ఘట్‌కేసర్ సమీపంలో నిద్ర మత్తులో ముందుగా వెళ్తున్న గుర్తు తెలియని వాహనాన్ని ఢీకొట్టడంతో రమేశ్ తలకు, చాతిభాగంలలో తీవ్ర గాయాలు కాగా అంబులెన్సులో సికింద్రాబాద్‌లోని యశోధ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. ప్రమాదంలో రమేశ్ ఇద్దరు స్నేహితులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. కాగా రమేశ్ పరిస్థితి విషమించడంతో ఆదివారం అర్ధరాత్రి 12:24 గంటలకు చనిపోయాడని వైద్యులు నిర్ధారించారు. మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రి మార్చురీలలో శవపరీక్ష నిమిత్తం తరలించి మృతుని తమ్ముడు భాస్కర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నామని ఘట్‌కేసర్ ఎస్ఐ శేఖర్ తెలిపారు.

# సోలార్ పవర్ ప్లాంట్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే

**కుల్కచర్ల, మే, 11 ప్రభాతవార్త:** మండలపరిధిలోని కామునిపల్లి గ్రామంలో పిఎంచ్-కెయుఎస్ఎం పథకం ద్వారా కోకటం వెంకట్‌రెడ్డి వ్యవసాయ పొలంలో రూ.7.50 కోట్లతో శ్రీ లక్ష్మి సోలార్ ప్లాంట్‌ను స్థానికులతోకలిసి ఎమ్మెల్యే రామ్మోహన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రామ్మోహన్ మాట్లాడుతూ... రైతులకు విద్యుత్ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పలు వినూత్నకార్యక్రమాలు చేపడుతున్నాయని అన్నారు.

పిఎంచ్-కెయూఎస్ఎం పథకం ద్వారా రైతులు సౌరశక్తిని వినియోగించుకోవడం ద్వారా వ్యవసాయ ఖర్చులను తగ్గించుకోవడంతో పాటు అదనపు ఆదాయం కూడా పొందే అవకాశం ఉందన్నారు.

ఈ కార్యక్రమంలోడిసిసి జిల్లా ఉపాధ్యక్షులు భీంరెడ్డి,



పిఎంచ్,సోలార్ పవర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రామ్మోహన్

మార్కెట్‌కమిటి చైర్మన్ ఆంజనేయులు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు గోపాల్ నాయక్, సర్పంచ్ సత్యమ్మ వెంకటేష్, అధికారులు ఎంపిడి రామకృష్ణ నాయక్, ఆయ గ్రామాల సర్పంచులు, మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ధారూర్‌లో ఇందిరమ్మ ఇళ్లు ప్రారంభం



ఇందిరమ్మ ఇండ్ల రిబ్బన్ కట్ చేస్తున్న స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్




విజేతలకు బహుమతులు అందజేసిన స్పీకర్

**ధారూర్, మే 11, ప్రభాత వార్త:** ధారూర్ మండల కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర శాసనసభాపతి, వికారాబాద్ నియోజకవర్గ ఎమ్మెల్యే గడ్డం ప్రసాద్ కుమార్ విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన రెండు ఇందిరమ్మ ఇండ్లను ఆయన రిబ్బన్ కత్తిరించి అధికారికంగా ప్రారంభించారు. లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపిన ఆయన, పేదల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తుందని, అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా లబ్ధి చేకూరుస్తామని ఈ సందర్భంగా పేర్కొన్నారు. గృహ ప్రవేశం చేసిన కుటుంబాలతో కలిసి ఆయన కాసేపు ముచ్చటించి వారి ఆనందాన్ని పంచుకున్నారు.

అనంతరం మండల కేంద్రంలో నిర్వహించిన గడ్డం శైలజ మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్ ముగింపు వేడుకలకు స్పీకర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఉత్కంఠభరితంగా సాగిన ఫైనల్ మ్యాచ్‌లో అద్భుత ప్రదర్శన కనబరిచి విజేతగా నిలిచిన ధారూర్ జట్టుకు ఆయన ట్రోఫీని, బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని, క్రీడలు శారీరక ధారుడ్యంతో పాటు మానసిక ఉల్లాసాన్ని ఇస్తాయని తెలిపారు. గ్రామీణ ప్రాంత క్రీడాకారుల్లో ఉన్న నైపుణ్యాన్ని వెలికితీయడానికే ఇటువంటి టోర్నమెంట్లు దోహదపడతాయని ఆయన కొనియాడారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ విజయభాస్కర్ రెడ్డి, డీసీసీ కార్యదర్శి బాబా ఖాన్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మాన్సింగ్, తహసిల్దార్ సాజిదా బేగం, ఎంపీఓ సఫీ ఉల్లా ఖాన్, నాయకులు, బుజ్జయ్య గౌడ్, యూనుస్, మాజీ జడ్పీటీసీ రాములు, క్రీడాకారులు, పెద్ద సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.

## పోలీస్ శిక్షకులకు ఉచిత మెటీరియల్ పంపిణీ చేసిన రాఘవేంద్ర రెడ్డి

**తలకొండపల్లి మే 11, ప్రభాతవార్త:**

ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, టాస్క్ సీఈవో సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి కల్వకుర్తి తాలూకాలోని నిరుపేద విద్యార్థులకు గత కొన్ని రోజులుగా పోలీస్ శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేసి వారందరికీ ఉచితంగా శిక్షణను అందజేస్తున్నట్లు సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి తెలిపారు. సోమవారం నాడు తలకొండపల్లి మండల కేంద్రంలో గత కొన్ని రోజులుగ్గా మండలంలోని సుమారు 50 మంది విద్యార్థిని విద్యార్థులకు ఉచితంగా పోలీసు శిక్షణ ను అందజేస్తున్నారు. సోమవారం నాడు శిక్షణ కేంద్రాన్ని సందర్శించి శిక్షణ పొందుతున్న శిక్షకులకు ఉచితంగా అవసరమాకు మెటీరియల్ అందజేశారు. ఈ సందర్భంగా వారిని ఉద్దేశించి సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి మాట్లాడుతూ కల్వకుర్తి తాలూకాలోని అన్ని మండల కేంద్రాలలో పోలీస్ ఉద్యోగాలకు ఆసక్తిగల నిరుద్యోగులకు తమ ఫౌండేషన్ ఐక్యత ఆధ్వర్యంలో అవసరమైన వారికి శిక్షణ నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. శిక్ష శిక్షణ కోసం ఫ్యాకల్టీలను హైదరాబాద్, విజయవాడ తదితర పట్టణాల నుంచి బోధకులను రప్పించి పేద ప్రజలకు శిక్షణ ఇప్పిస్తున్నట్లు ఆయన తెలిపారు. హైదరాబాద్ తదితర పట్టణ కేంద్రాలలో శిక్షణ పొందేందుకు ఆర్థిక స్తోమత లేని నిరుపేద



మెటీరియల్ అందజేస్తున్న సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండల కేంద్రాల్లో పేద విద్యార్థులకు ఉచిత శిక్షణ

విద్యార్థిని విద్యార్థులకు తమ ఫౌండేషన్ ద్వారా ఉద్యోగం పొందేందుకు కృషి చేయనున్నట్లు ఆయన తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లోని నిరుపేద నిరుద్యోగులకు పోటీపరీక్షలకు సిద్ధమైన వారికి అవసరమాకు మెటీరియల్ శిక్షణ అందుబాటులో లేకపోవడంతో వారు మానసికంగా ఎంతో ఇబ్బందులకు గురైవారన్నారు. వారందరి కోసం తమ సంస్థ ద్వారా శిక్షణ ఏర్పాటు చేస్తున్నామని, శిక్షణ పొందే వారందరూ ఆత్మవిశ్వాసంతో సమయపాలన పాటించి, క్రమశిక్షణ అలవాటు చేసుకుని లక్ష్యాన్ని సాధించుకోవాలని ఆయన సూచించారు. అనంతరం వారికి ఉచితంగా మెటీరియర్ రియల్ ను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో లెక్చరర్ బృందంతోపాటు ఐకిత ఫౌండేషన్ సభ్యులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

శివారెడ్డిగూడలో ముస్తాబైన శ్రీపసన్నవీరాంజేయస్వామి ఆలయం



# హనుమజ్జయంతి ఉత్సవాలకు ఏర్పాట్లు

### –ఆలయాలు ముస్తాబు..శోభాయాత్ర

**ఘట్‌కేసర్, మే 11, ప్రభాతవార్త:** మంగళవారం హనుమజ్జయంతి సందర్భంగా ఘట్‌కేసర్ సర్కిల్ పరిధిలోని ఆంజనేయస్వామి దేవాలయాలలో ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయాలలో మామిడి తోరణాలు కట్టి విదుత్ దీపాలతో అలంకరిస్తున్నారు. ఘట్‌కేసర్, కొండాపూర్, ఎన్ఎఫ్‌సీనగర్, శివారెడ్డిగూడ, గీతామందిర్, ఘనాపూర్, అవుషాపూర్, అంకుశాపూర్, ఎదులాబాద్, మర్రిపల్లిగూడ, చందుపట్లగూడ, బొక్కోనిగూడ తదితర చోట్ల హనుమజ్జయంతికి ఆలయ కమిటీలు, నిర్వహకులు తగిన ఏర్పాట్లు చేశారు. ఘట్‌కేసర్ డివిజన్ శివారెడ్డిగూడలోని శ్రీదండ్లగడ్డ ప్రసన్నవీరాంజనేయస్వామి దేవస్థానంలో మంగళవారం జరిగే హనుమజ్జయంతి ఉత్సవాలకు తగిన ఏర్పాట్లు చేస్తున్నామని ఆలయ చైర్మన్ కొంతం రాంరెడ్డి తెలిపారు. హనుమజ్జయంతి సందర్భంగా అర్చకుల మంత్రోచ్చారణాల మధ్య సోమవారం ఉదయం 5 గంటలకు గణపతిహవనం ఘనంగా నిర్వహించారు. మంగళవారం 6 గంటలకు అంజనేయస్వామికి అష్టోత్తరశత కలశాలతో విశేష అభిషేకం, అర్చన, మంగళహారతి నిర్వహిస్తామని ఉదయం 9 గంటలకు సుందరాకాండ పారాయణం, సాయంత్రం 6 గంటలకు శ్రీశ్రీశ్రీ దండ్లగడ్డ ప్రసన్నవీరాంజనేయస్వామికి పల్లకి ఉత్సవం వైభవంగా జరుగుతుందని భక్తులు ఉత్సవాల్లో అధిక సంఖ్యలో పాల్గొనాలని రాంరెడ్డి కోరారు.

### ..హనుమాన్ శోభాయాత్ర..

హనుమజ్జయంతి సందర్భంగా మంగళవారం సాయంత్రం 6 గంటలకు శ్రీహనుమాన్ శోభాయాత్ర నిర్వహిస్తున్నట్లు భజరంగ్ దళ్ సేవాసంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు వసులాది చంద్రశేఖర్ తెలిపారు. శివారెడ్డిగూడలోని శ్రీప్రసన్నవీరాంజేయ మల్లిఖార్జున స్వామి దేవాయ ఆవరణలో ప్రత్యేక పూజలు చేసి వీరహనుమాన్ శోభాయాత్ర ప్రారంభిస్తామని చెప్పారు. ఈసందర్భంగా ఘట్‌కేసర్ పట్టణంలో రహదరిపై పలుచోట్ల కాషాయం జెండాలను ఏర్పాటు చేశారు. భజరంగ్‌దళ్ సేవా సంస్థ ఆధ్వర్యంలో జరిగే కార్యక్రమంలో హనుమాన్, శ్రీరాముడు, చత్రపతి శివాజీ భారీ విగ్రహాలను రహదారిపై అంబేద్కర్ చౌరస్తా, బస్‌టెర్మినల్, తిరిగి ఎదులాబాద్ రోడ్డు మీదుగా ఈశ్వరాగ్యాస్ ఎజెన్సీ వరకు అంగరంగవైభవంగా ఊరేగింపు జరుగుతుందని భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు.

## నేడు గిరి ప్రదక్షిణకు ఏర్పాట్లు

**కొందుర్గు, మే 11, ప్రభాతవార్త:** హనుమాన్ జయంతిని పురస్కరించుకొని జిల్లేడు చౌదరిగుడా మండల పరిధిలోని దుంపల్లి శివారులో గల వేదగిరిగుట్టపై మంగళవారం నాడు ప్రారంభించే గిరి ప్రదక్షణ కార్యక్రమానికి మండలం నుండి ప్రజలు అధిక సంఖ్యలో తరలి రావాలని బిజెపి మండల శాఖ అధ్యక్షులు చిట్టెం లక్షీ మ్రకాంత్ రెడ్డి కోరారు. గిరి ప్రదర్శన కార్యక్రమాన్ని ప్రారంభించేందుకు అంబాత్రియ క్షేత్ర వ్యవస్థా పకులు ఆదిత్య పరాశ్రీస్వామి, వేదగిరి పీఠం వ్యవస్థాపకులు డాక్టర్ మర్రి కృష్ణారెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొంటున్నారని ఆయన వివరించారు. మండలం నుండి అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.



ఇందిరమ్మ ఇల్లు గృహ ప్రవేశంలో పాల్గొన్న నేతలు

## పేదోళ్ల సొంతింటి కల సాకారం

**కుల్కచర్ల, మే, 11 ప్రభాతవార్త:** కాంగ్రెస్ ప్రభుత్వంతోనే పేదల సొంతింటి కల సాకారం అవుతుందని డిసిసి జిల్లా ఉపాధ్యక్షులు భింరెడ్డి, మార్కెట్ కమిటి చైర్మన్ బిఎస్ ఆంజనేయులు ముదిరాజ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు గోపాల్ నాయక్, అన్నారు. మండల పరిధిలోని చెరువు ముందలి తాండ(ఎ) గ్రామ పంచాయతీలో గోరమ్మ కర్భ్యనాయక్‌కు ఇందిరమ్మ ఇళ్ళు మంజూరు కావడంతో నిర్మాణం పూర్తి చేసుకుని సోమవారం గృహప్రవేశం నిర్వహించారు. ఈ గృహప్రవేశానికి స్థానిక సర్పంచ్ రవీందర్ నాయక్‌తో కలిసి వారి దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు గోపాల్ నాయక్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఇందిరమ్మ ఇళ్లు చేపట్టిన పథకం ఇందిరమ్మ ఇల్లు నిర్మాణం పూర్తికావడం లబ్దిదారులు నూతన గృహప్రవేశం చేయడం ఎంతో సంతోషంగా ఉన్నదన్నారు. ఈ కార్యక్రమంలో పిరంపల్లి సర్పంచ్ గడ్డం వెంకటయ్య, రాంపూర్ సర్పంచ్ తిరుపయ్య, గ్రామ అధ్యక్షులు శ్రీనువాస్ నాయక్, సినియర్ నాయకులు మహేష్, యువ నాయకులు లాలు గ్రామ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## అడపడుచు పెళ్లికి అండగా కానుక



పెళ్లికి ఆర్థిక సాయం అందజేస్తున్న సర్పంచ్

**కుల్కచర్ల, మే, 11 ప్రభాతవార్త:** ప్రతి పేదింటి అడబిడ్డ పెళ్లిళ్ళకు అండగా ఉంటామని సర్పంచ్ రాజునాయక్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని ఎర్రగోవింద్ తాండ గ్రామ పంచాయతీలో వార్డు సభ్యులు సీతమ్మ మనవరాలు స్వప్న వివాహానికి సర్పంచ్ రాజు నాయక్ తన సొంత డబ్బుతో 100కిలోల సోన బియ్యం, 15 కేజిల వంట నూనే, కానుక అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ రాజు నాయక్ మాట్లాడుతూ.. పేదింటి అడబిడ్డ పెళ్లిళ్ళకు ఎల్లప్పుడు అండగా ఉంటామని పేర్కొన్నారు. ఈ పథకం ప్రతి పేదింటి అడపడుచు పెళ్లికి అందిస్తునట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తాండ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## జగ్గంగూడలో సిసి రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన



జగ్గంగూడలో సిసి రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన మూడుచింతలపల్లి మున్సిపల్ చైర్మన్ జాము రవి, పాల్గొన్న కౌన్సిలర్లు, కమిషనర్, తదితరుల దృశ్యం

**శామీర్‌పేట, మే 11, ప్రభాతవార్త:**

జగ్గంగూడలో సిసి రోడ్డు నిర్మాణ పనులకు మూడుచింతలపల్లి మున్సిపల్ చైర్మన్ జాము రవి శంకుస్థాపన చేశారు. సోమవారం మూడుచింతలపల్లి మున్సిపాల్టీలోని జగ్గంగూడలో ఎంపి నిధులు రూ.10లక్షలు, జనరల్ నిధులు రూ.2లక్షలతో కలిపి సిసి రోడ్డు నిర్మాణంకు స్థానిక కౌన్సిలర్లతో కలిసి శంకుస్థాపన చేసినట్లు చైర్మన్ జాము రవి తెలిపారు. ఈ సందర్భంగా చైర్మన్ జాము రవి మాట్లాడుతూ మున్సిపాల్టీ అభివృద్ధే లక్ష్యంగా ముందుకు వెళుతున్నట్లు తెలిపారు. మున్సిపల్‌లోని వార్డుల్లో (గ్రామాల్లో) రోడ్ల సమస్యను పరిష్కరించటానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ పవన్‌కుమార్, కౌన్సిలర్లు విష్ణువర్ధన్‌రెడ్డి, జంగారెడ్డి, మేడ్చల్ ఎఎంసి మాజీ వైస్‌చైర్మన్లు ఇర్రి రవీందర్‌రెడ్డి, ఎం.శ్రీకాంత్‌రెడ్డి, నాగరాజు, జిల్లా బిజెపి రూరల్ అధ్యక్షులు బుద్ది శ్రీనివాస్, బిఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి టి.అనిల్‌రెడ్డి, నాయకులు బాల్‌రెడ్డి, జహంగీర్, నాగరాజుచారి, శ్రీకాంత్‌రెడ్డి, రమేశ్, స్వామి, విష్ణు, గ్రామ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు తమ ప్రతిభను చాటాలి

**శామీర్‌పేట, మే 11, ప్రభాతవార్త:** విద్యార్థులు వేసవి సెలవులను సద్వినియోగం చేసుకుంటూ కొత్త విషయాలను నేర్చుకోవాలని, తమ ప్రతిభను మరింత చాటాలని, చదువుతో పాటు వ్యక్తిత్వ వికాసం కూడ ముఖ్యమని మూడుచింతలపల్లి మున్సిపల్ చైర్మన్ జాము రవి పేర్కొన్నారు. సోమవారం మూడుచింతలపల్లి మున్సిపల్ పరిధిలోని లక్ష్మాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యా వారోత్సవాల్లో భాగంగా విద్యార్థుల కోసం సమ్మర్ క్యాంపును చైర్మన్ జాము రవి ప్రారంభించారు. తాను పదవిలో ఉన్నా లేకున్నా విద్యాభివృద్ధి కోసం తన పూర్తి సహకారం ఉంటుందని, నిరంతరం విద్య అభివృద్ధి కోసం కృషి చేస్తానన్నారు. పదవతరగతి ఫలితాల్లో ఉత్తమ ర్యాంకులను సాధించిన విద్యార్థులను త్వరలోనే సన్మానించి వారికి ప్రోత్సాహక బహుమతులను కూడ అందజేస్తానని చైర్మన్ జాము రవి ప్రకటించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ సరితశ్రీనివాస్‌గౌడ్, మాజీ సర్పంచు సింగం అంజనేయులు, మాజీ ఎంపిటిసి పారుపల్లి నాగరాజు, ఎంఇఓ భాగ్యమణి, ఇంచార్జి ప్రధానోపాధ్యాయురాలు శారదా రాజ్యలక్ష్మి, గ్రామ నాయకులు క్యాతం మధుకృష్ణ, గోపాల్, శ్రీనివాస్, శ్రీనివాస్‌చారి, ఆకుల భూపాల్, పాఠశాల కమిటీ చైర్మన్ సాంబలక్ష్మి, గ్రామ పెద్దలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.




లక్ష్మాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సమ్మర్‌క్యాంపును ప్రారంభించిన మూడుచింతలపల్లి మున్సిపల్ చైర్మన్ జాము రవి, పాల్గొన్న కౌన్సిలర్లు, ఎంఇఓ, నాయకుల దృశ్యం